జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 06 జూన్ 2026 | సంపుటి: 19 | సంచిక: 90 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , జ్యేష్ఠ మాసము , తిథి: ప్రథమ - 16:40:04 వరకు నక్షత్రంజ్యేష్ఠ - 19:09:15 వరకు కరణంకౌలవ - 16:40:04 వరకు పక్షంకృష్ణ యోగంసిద్ధ - 06:18:08 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## యథాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

**ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బిఐ**

**రెపోరేటును యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం**

**ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి**

ముంబై,జూన్5(ప్రజాజ్యోతి): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్

మిగతా 2లో..

## హైదరాబాద్‌లో ఎబోలా కలవరం

**ఇప్పటికే గాంధీలో ఇద్దరికి చికిత్సలు**

హైదరాబాద్,జూన్5(ప్రజాజ్యోతి): హైదరాబాద్‌లో ఎబోలా అనుమానిత కేసులు కలకలం రేపాయి. ఎబోలా లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన ఇద్దరు వ్యక్తులను రాత్రి సమయంలో అపోలో ఆస్పత్రి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ఎమర్జెన్సీ విభాగంలో వారికి చికిత్స అందిస్తున్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న వైద్య బృందం అవసరమైన పరీక్షలు నిర్వహిస్తోంది. రోగుల

మిగతా 2లో..

# బీఆర్ఎస్‌వి అన్నీ అబద్ధాలే..

## మీ పదేళ్ల పాలన.. నా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దామా

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండి

- ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతాం
- ఎంపీగా గెలిపిస్తే పాలమూరు ఒరగబెట్టిందేమీ లేదు
- మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటా
- నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణె మా లక్ష్యం
- జడ్చర్ల సభలో కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్



జడ్చర్ల,జూన్ 5(ప్రజాజ్యోతి): నీ పదేళ్ల పాలన.. నా రెండున్నరేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా? అంటూ కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా.. ఈ చర్చలో ఓడితే తాను దేనికైనా సిద్ధమని కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం జడ్చర్ల పరజాపాలన-ప్రగతి ప్రణాళిక సభ వేదికపై నుంచి నిప్పులు చెరిగారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు

మిగతా 12లో..



## నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ కోట్లు దోపిడీ

కమీషన్లు దండుకుని ఒక్క ఎకరాకు నీరు అందించలే

కేసీఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ చేపట్టలేదు

కమీషన్ల కోసం కాళేశ్వరం చేపట్టినా.. కూలింది

ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టుల్లో పెండింగే

పాలమూరు ఎంపిగా ఉన్నా జిల్లాకు కేసీఆర్ చేసింది శూన్యం

జిల్లా ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం

రెండోరోజు జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్,జూన్5(ప్రజాజ్యోతి): గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల కమీషన్లు కొల్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమీషన్లు దండుకొని ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని ఆగ్రహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి రెండోరోజు పర్యటించారు. బీఆర్ఎస్ హయాంలో కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ

మిగతా 12లో..

# దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారు

## అత్మనిర్భర్ భారత్', దేశ దృఢ సంకల్పన్ని విమర్శిస్తుంటారు

## సూరత్ సభలో రాహుల్‌పై ప్రధాని మోడీ పరోక్ష విమర్శలు



న్యూఢిల్లీ,జూన్5(ప్రజాజ్యోతి): దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారనీ, 'అత్మనిర్భర్ భారత్' ప్రచారాన్ని, దేశ దృఢ సంకల్పన్ని విమర్శించడమే వీళ్లు పనిగా పెట్టుకున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపైన, కాంగ్రెస్ పార్టీపైనా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ఇతర దేశాలపై ఆధారపడం వల్ల ఏ దేశం తాను నిజంగా సాధించాల్సిన అభివృద్ధిని అందుకోలేదన్న విషయాన్ని వీరు విస్మరిస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లోని సూరత్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అలజడలు,

మిగతా 2లో..

## కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం

**శోకం మిగిల్చిన ఎల్లమ్మ పండగ వేడుక**

**మంజీరాలో ఈతకు వెళ్లి నలుగురు మృత్యువాత**

కామారెడ్డి,జూన్5(ప్రజాజ్యోతి): కామారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగిన నలుగురు ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టగా.. ముగ్గురి మృత దేహాలు లభ్యమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం మంగల్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది బాన్సువాడ మండలం బుడిమి శివారులోని మంజీరా నది వద్ద ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చారు. వీరిలో భానుప్రసాద్, అనిత, పావని , శివాని నదిలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో నదిలో నలుగురూ గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు

మిగతా 2లో..

## ఇంట్లో పేలి సిలిండర్

**అమ్మమ్మతో పాటు ఇద్దరు మనవళ్ల మృతి**

నల్లగొండ,జూన్5(ప్రజాజ్యోతి): నల్లగొండ జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. మిర్యాలగూడలోని ఓ ఇంట్లో అర్ధరాత్రి సమయంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి

మిగతా 2లో..

## చేనేతతో సంస్కృతి సాంప్రదాయాలు

# విశ్వవ్యాప్తం

పోచంపల్లి చేనేత కళకు అంతర్జాతీయ గుర్తింపు

చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభం

7వ తేదీ వరకు కొనసాగనున్న చేనేత ప్రదర్శన



హైదరాబాద్,జూన్5(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న థ్రెడ్ పోచంపల్లి చేనేత వస్త్ర ప్రదర్శనను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించారు. పోచంపల్లి ఇక్కత్ చేనేత కళకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడి నేతన్నల నైపుణ్యం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన చేనేత సంప్రదాయాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు లభించిన జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ ఇక్కడి కళాకారుల సృజనాత్మకతకు, నైపుణ్యానికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపని మంత్రి తెలిపారు. భూదాన్ ఉద్యమానికి చారిత్రక కేంద్రంగా నిలిచిన పోచంపల్లికి ప్రత్యేక స్థానం ఉందని, పోచంపల్లి రుమాళ్లు, ఇక్కత్ చీరలకు ప్రపంచ మార్కెట్‌లో మరింత ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందనన్నారు. ముఖ్యమంత్రి

మిగతా 2లో..

# ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు

**కొత్త పార్టీ పెట్టబోతున్న అన్నామలై**


**ప్రజలు లక్ష్యంగా రాజకీయ పార్టీని నడిపిస్తా**

**బీజేపీకి భారం కాకూడదనే బయటకు వచ్చా**

**ఒంటరిగా పోటీచేయాలన్న వాదనను పట్టించుకోని బీజేపీ**

**గతంలో రజనీకాంత్ సార్ తనతో కలవమని కోరారు**

**మీడియా సమావేశంలో మాజీ బీజేపీ నేత అన్నామలై**



చెన్నై,జూన్5(ప్రజాజ్యోతి): తమిళనాడు రాజకీయాల్లో కొంతకాలంగా ఆసక్తి పరిణామాలు చోటుచేసుకుం టున్నాయి. ఇంత కాలం సీఎం విజయ్‌పై ఉన్న దృష్టి.. ఇప్పుడు అన్నామలై వైపు మళ్లింది. ఆయన ఇప్పటికే భాజపాను వీడగా.. తన రాజకీయ భవిష్యత్తు గురించి తాజాగా మీడియాతో మాట్లాడారు. బిజెపికి రాజీనామా చేసిన మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. కొత్త రాజకీయ ఉద్యమం చేయబోతున్నట్లు

మిగతా 12లో..

## తృణమూల్ అధినేత్రికి మరో షాక్

**పార్లమెంట్ ఎంపీలు తిరుగుబాటు**

**అభిషేక్ బెనర్జీ నాయకత్వాన్ని వ్యతిరేస్తున్న ఎంపీలు**



కోల్‌కతా,జూన్5(ప్రజాజ్యోతి): పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ కు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. పార్టీ రెబల్ గ్రూప్ ఎమ్మెల్యలతో 23 మంది ఎంపీలు ప్రస్తుతం సంప్రదింపులు సాగిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలు తాజాగా బాంబు పేల్చాయి. దీంతో రాబోయే రోజుల్లా టీఎంసీ పార్లమెంటరీ విభాగం నిట్టనిలువుగా చీలిపోయే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో ఇప్పటికే రెబల్ ఎమ్మెల్యేలు పట్టు సాధించారు. పార్టీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా 57 మంది టీఎంసీలు ఎమ్మెల్యేలు ఇటీవల ఎన్నుకున్నారు. ఆ ఎన్నికను స్పీకర్ రతీంద్ర బోస్ కూడా

మిగతా 2లో..

## జపాన్- తెలంగాణ సహకారానికి కొత్త దిశ..

ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో అవకాశాలపై చర్చలు



హైదరాబాద్,జూన్5(ప్రజాజ్యోతి): జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్‌కు చెందిన ప్రతినిధి బృందం శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు మరియు భూగర్భశాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామితో సమావేశమైంది. ఈ సమావేశాన్ని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ (టామ్‌కామ్) సమన్వయం చేసింది. సమావేశంలో జపాన్ ప్రతినిధులు వివిధ పరిశ్రమలు, రంగాల్లో భారత యువతకు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాల గురించి మంత్రికి వివరించారు. తెలంగాణ?జపాన్ మధ్య నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాల విస్తరణ, శిక్షణ పొందిన మానవ వనరుల అభివృద్ధి వంటి అంశాలపై పరస్పర సహకార అవకాశాలపై చర్చలు జరిగాయి. హైదరాబాద్‌తో జపాన్ నగరాల అనుబంధానికి రెండు దశాబ్దాల చరిత్ర ఉందని, ప్రస్తుతం ఆ భాగస్వామ్యం

మిగతా 2లో..

## నిధులు, నియామకాలు, నీళ్లలో వైఫల్యం

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం
- బీజేపీ కోసం ప్రజలు ఆశగా చూస్తున్నారు
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



మహబూబాబాద్,జూన్5(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు

మిగతా 2లో..

# సంపాదకీయం

## ఏటేటా పెరుగుతున్న పర్యావరణ విధ్వంసం!

ఏటా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నా..మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏటా జూన్ 5న మొక్కలు నాటడం, ఫోటలకు పోజులు ఇవ్వడం, సైకిల్ తొక్కడం వంటివన్నీ చేస్తున్న పాలకులు చిత్తశుద్ధితో పర్యావరణ పరిరక్షణ చర్యలకు పూనుకోవడం లేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమిచకపోవడం వల్ల ఎల్‌నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఈ యేడు కూడా నైరుతి ఆలస్యంగా ప్రవేశించింది. ఇంకా ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఒకప్పుడు జూన్ మాసం వచ్చే వరకు జోరు వర్షాలు పడేవి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు. పెరుగుతన్న జనాభే పర్యావరణ విధ్వంసానికి మొదటి చేటుగా గుర్తిచాలి. పెరిగన జనాభా తమ అవసరాల కోసం పర్యవరణ విధ్వంసానికి పాల్పడుతోంది. దీనికి పాలకులే బాధ్యత వహించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను,మట్టిని తోడస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు. నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేక పోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జానావాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పంచభూతాలను రక్షించుకోవడం అన్నది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యావరణం. ఈ రెండింటినీ కూడా భగవంతుడే సృష్టించాడు. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవడం లేదు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది. అందుకే నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి,రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియ చేస్తున్నాయి. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపంగా భావించారు. నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది. భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్నీ, మనపరిసరాలనూ, చెట్టూ,పుట్టా, గాలీ, నీరు, కొండాకోనా, వాగూవంకా,పిట్టాపిచికా, అన్నిటినీ రక్షించుకోవడం అన్న అర్థంలో చెప్పారు. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీసు కుంటూ వస్తున్నారు. ఏది చేసినా ఆలోచన చేయడం లేదు. పాలకుల విధ్వంసకర విధానాలవల్ల భారతదేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడం లేదు. జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగృతపరిచే ప్రయత్నాలు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ సమ్మేళనం ఒకటి నిర్వహించింది. అన్ని దేశాలను ఆహ్వానించింది. స్వీడన్ లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సుమారు 119 దేశాలు పాల్గొన్నాయి. అలా ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడం అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీనివల్ల కేవలం మనుషలేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు.నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రజలు అంతకు మించి అన్నట్లు మిన్నకుంటున్నారు. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నదుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వాటిని సంరక్షించుకోవాలి. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. మనకు జీవితాన్ని ప్రసాదించి, జీవనం కోసం ఉపయోగ పడుతున్న భూమిని తన స్వార్థ ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు. గృహ వ్యర్థాలు, చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బ తింటోంది. మన దేశంలో ప్రతి రోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకు భూమిలో నాశనం కాకుండా నిల్వ ఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశుపక్ష్యాదులు వీటిని తినడం వల్ల చనిపోతున్నాయి. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ప్రమాదం. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు పాలుపడాల్సిన అవసరం ఉంది.

# దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారు

మొదటిపేజీ తరువాయి..

అస్థిరతను వ్యాప్తి చేయడం ద్వారా అవకాశాలు పొందాలని కోరుకుంటోందని, అయితే దేశ ప్రజలకు వీరి పన్నాగాలను ఎప్పటికప్పుడు



తిప్పికొడుతూ వస్తున్నారని ప్రధాని అన్నారు. 'గుజరాత్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అడ్రెస్ లేకుండా చేసారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల కూడా వారి అవకతవకల పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల హిమాచల్ ప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఇందుకు ఉదాహరణ. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఆ పార్టీ దారుణమైన ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ అవకతవకల పాలనను హిమాచల్ ప్రజలు తిప్పికొట్టారు. దీనికి ముందు హర్యానాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. పంజాబ్ ప్రజలు కూడా ఆ పార్టీకి స్పష్టమైన సందేశం ఇచ్చారు. అల్లకల్లోలంలో అవకాశాలు వెతుక్కోవడం అనే కాంగ్రెస్ రాజకీయం ఎప్పటికీ పనిచేయదు' అని మోదీ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అందుకే ముఖ్యమంత్రిని కూడా మార్చాల్సి వచ్చిందని ఇటీవల అక్కడ జరిగిన పరిణామలపై మోదీ వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు తమ కలలు, ఆకాంక్షలను కార్యరూపంలోకి రావాలనే పట్టుదలతో ఉన్నారని, దేశ ప్రజల సమష్టి సంకల్పంతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఇటీవల కాలంలో అనేక సంక్షోభాలను ప్రపంచం ఎదుర్కొందని, తొలుత కోవిడ్ సంక్షోభం, ఆ తర్వాత ఇంధన సంక్షోభం కుదిపేసిందని అన్నారు. పెట్రోల్ ధరల్లో నిలకడ లేకపోవడం, సప్లయ్ చైన్స్ కుప్పకూలడం వంటివి చోటచేసుకున్నాయని, అయితే ప్రతి సంక్షోభాన్ని 140 కోట్ల మంది ప్రజలు సమష్టిగా ఎదుర్కోవడం తనకెంతో తృప్తినిచ్చిందని అన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా సూరత్‌లో రూ.18,800 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

## జపాన్- తెలంగాణ సహకారానికి కొత్త దిశ..

మొదటిపేజీ తరువాయి..

20వ సంవత్సరాన్ని జరుపుకుంటోందని ప్రతినిధి బృందం పేర్కొంది. ఈ సందర్భంగా మంత్రి డా. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. రాష్ట్ర యువతకు విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో, వారి ఉపాధి సామర్థ్యాలను పెంపొందించడంలో టామ్‌కామ్ అత్యంత వృత్తిపరమైన, లక్ష్యబద్ధమైన కృషి చేస్తోందని తెలిపారు.జపాన్ సాంకేతిక నైపుణ్యం, పని సంస్కృతి తనను ఎంతో ఆకట్టుకున్నాయని మంత్రి పేర్కొన్నారు. జపాన్ యంత్రాల ఖచ్చితత్వంతో పాటు అక్కడి ప్రజల వినయం, క్రమశిక్షణ తనను ప్రభావితం చేశాయని అన్నారు. ఈ సమావేశంలో లేబర్ ఎంఎ÷-లాయ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ ఫ్యాక్టరీస్ అభివృద్ధి అవకాశాలపై సమగ్ర ప్రజెంటేషన్



శాఖ కార్యదర్శి దాసరి హరిచందన తెలంగాణ ఇచ్చారు.

# చేనేతతో సంస్కృతి సాంప్రదాయాలు విశ్వవ్యాప్తం



మొదటిపేజీ తరువాయి..

రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండున్నర సంవత్సరాల్లో చేనేత రంగం అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం సుమారు రూ.1,400 కోట్లకు పైగా ఖర్చు చేశామని తెలిపారు. నేతన్నల ఉపాధికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. గ్లోబలైజేషన్ పోటీని ఎదుర్కొనేందుకు రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ సంస్థ ద్వారా చేనేత కుటుంబాల పిల్లలకు ఆధునిక డిజైన్లు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందించి అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. డూప్లికేట్ ఉత్పత్తుల వల్ల చేనేత బ్రాండ్‌కు కలిగే నష్టాన్ని నివారించడంలో కూడా ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనకు మరింత మంది ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు తీసుకుని చేనేత కళాకారులకు ప్రోత్సాహం అందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ..పోచంపల్లి నేతన్నలు అగ్గిపెట్టెలో పట్టేంత సన్నని చీరలను



నేసి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. అందుకే పోచంపల్లి 'సిల్క్ సిటీ ఆఫ్ ఇండియా'గా ఖ్యాతి గడించింది. ఈ ఎగ్జిబిషన్ ద్వారా చేనేత కార్మికులకు మరిన్ని మార్కెటింగ్ అవకాశాలు, వారి శ్రమకు తగిన ఆదాయం లభించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టెక్స్టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సహకారంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చేనేత కార్మికుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతన్నలందరికీ అభినందనలు తెలిపారు. ÷ాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 12 వేల మంది చేనేత కార్మికులు, అనుబంధ వృత్తిదారులు తమ జీవనోపాధిని ఈ రంగంపైనే ఆధారపడి కొనసాగిస్తున్నారని మంత్రి తెలిపారు. వారి కష్టానికి తగిన గుర్తింపు, ఉత్పత్తులకు విస్తృత మార్కెట్, మెరుగైన ఆదాయం కల్పించాలనే లక్ష్యంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పోచంపల్లి ఇక్కత్, పుట్టపాక తెలియా రుమాలు వంటి భౌగోళిక గుర్తింపు (ఉఐ) పొందిన ఉత్పత్తులు యాదాద్రి భువనగిరి జిల్లాకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని మంత్రి పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ చేనేత కళ, నేతన్నల అపూర్వ నైపుణ్యం, సంప్రదాయ వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా నిలుస్తుందన్నారు. ఇక్కడి నేతన్నలు ఇక్కత్, డబుల్ ఇక్కత్ పద్ధతుల్లో పత్తి, పట్టు, సికో వస్త్రాలను తయారు చేస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో ఎబోలా కలవరం

మొదటిపేజీ తరువాయి..

ప్రయాణ వివరాలు, వైద్య చరిత్ర, సంప్రదించిన వ్యక్తుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. పరిస్థితిని ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే.. కాంగోలో ఎబోలా మహమ్మారి వ్యాప్తిని అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర స్థితిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఈ మహమ్మారి వ్యాప్తిని ఎదుర్కోవడం చాలా కష్టం. ఎందుకంటే, ఇది అత్యంత అరుదైన వైరస్ రకానికి చెందినది. దీనికి ఎలాంటి టీకా లేదు. డీఆర్ కాంగోలో అంతర్గత సంఘర్షణలు నెలకొన్న ప్రాంతంలో ఈ కేసులు నమోదవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ మహమ్మారి వ్యాప్తి ఊహించినదానికంటే వేగంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేస్తోంది.

## యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

మొదటిపేజీ తరువాయి..

సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తు న్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి



తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నాం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు నిబంధనలను సరళీకరించాం. ఈక్విటీ మార్కెట్‌లో ఎన్‌ఆర్‌ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచాం. ఎక్స్ఛేంజ్ రేట్‌పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. మన దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆర్థికంగా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా, అప్రమత్తంగా ఉంది.

## నిధులు, నియామకాలు, నీళ్లలో వైఫల్యం

మొదటిపేజీ తరువాయి..

రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

## పుప్పాలగూడలో ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్

హైదరాబాద్,జూన్5(ప్రజాజ్యోతి): హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ పరిధిలో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. ప్రభుత్వ స్థలం చుట్టూ హైడ్రా సిబ్బంది ఫెన్సింగ్ వేశారు. రూ.30వేల కోట్ల విలువైన భూమిని కాపాడినట్లు హైడ్రా తెలిపింది.పుప్పాలగూడ భూముల్లో చారిత్రక రాతి గుట్టలు ఉన్నాయి. ఈ భూములను గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు కేటాయించింది. చారిత్రక గుట్టలను కాపాడాలని కోరుతూ సొసైటీ టు సేవ్ రాక్స్ ప్రతినిధులు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. గతంలో హైకోర్టును కూడా ఆశ్రయించారు. రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని రక్షించాలని ఉన్నత న్యాయస్థానం మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం కావడంతో భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ విషయాన్ని సొసైటీ టు సేవ్ రాక్స్ ప్రతినిధులు ఇటీవల హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో శుక్రవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి హైడ్రా సిబ్బంది ఫెన్సింగ్ వేశారు.

## తృణమూల్ అధినేత్రికి మరో షాక్

మొదటిపేజీ తరువాయి..

గుర్తించారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలు మమతా బెనర్జీని గౌరవిస్తున్నామని చెబుతూనే, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ నాయకత్వాన్ని మాత్రం ఒప్పుకునేది లేదని కరాఖండిగా చెబుతున్నారు. తాజాగా టీఎంసీ ఎంపీల్లోనూ అసంతృప్తి పెల్లుబుకుతోంది. అభిషేక్ బెనర్జీ పట్ల పలువురు అసంతృప్తితో ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంటరీ ప్రత్యేక కూటమిగా ఏర్పాటేందుకు వీరు చర్చలు జరుపుతున్నారని, 12 మందికి పైగా ఎంపీలు ఇందుకు సముఖంగా ఉన్నారని అంటున్నాయి. టీఎంసీ పార్లమెంటరీ ప్రత్యేక కూటమిగా ఏర్పడేందుకు, చీలక తెచ్చేందుకు తగిన సంఖ్యాబలంపై కూడా చర్చ జరుగుతోందని చెబుతున్నారు. టీఎంసీకి లోక్‌సభలో ప్రస్తుతం 29 మంది ఎంపీలు ఉన్నారు. ప్రత్యేక గ్రూపుగా ఏర్పడి ఫిరాయింపుల చట్టం నుంచి వేటుపడకుండా ఉండాలంటే కనీసం 23 మంది మద్దతు ఇందుకు అవసరమవుతుంది. రాజ్యసభ పరంగా చూస్తే టీఎంసీకి 13 మంది ఎంపీలున్నారు. ప్రత్యేక గ్రూపుగా గుర్తింపు పొందాలంటే కనీసం 9 మంది ఎంపీలు కలిసిరావాలి. ఈ పరిణామాలపై రెబల్ నేత రీతాబ్రత బెనర్జీని ప్రశ్నించగా, గత వారం రోజుల్లో తాను ఏ ఎంపీతోనూ మాట్లాడలేదని, అందువల్ల వాళ్లు ఏమి చేయాలనుకుంటున్నారో తనకు తెలియదని చెప్పారు. అయితే రేపటిరోజు ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరని అన్నారు. దీనిపై వెటరన్ రాజ్యసభ ఎంపీ సుఖేందర్ శేఖర్ రాయ్ మాట్లాడుతూ, ఇంత తక్కువ సమయంలో 60 మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోవడం ఎప్పుడూ చూడలేదని, అదే స్పందన లోక్‌సభలోనూ ఉండే అవకాశాలు లేకపోలేదని అన్నారు.

## స్పా సెంటర్లలో అసాంఘీక కార్యకలాపాలు

### 113 స్పా సెంటర్లపై పోలీసుల తనిఖీలు

హైదరాబాద్,జూన్5(ప్రజాజ్యోతి): నగరంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పలు స్పా సెంటర్లపై పోలీస్ బృందాలు శుక్రవారం ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించాయి. దాదాపు 500 మంది పోలీసులు.. బృందాలుగా ఏర్పడి 113 స్పా సెంటర్లపై ముకుమ్మడిగా తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలు స్పా సెంటర్లలో అక్రమాలతోపాటు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. కస్టమర్లకు సంబంధించిన డేటా రిజిస్టర్‌ను సైతం స్పా సెంటర్ నిర్వాహకులు మెయింటెయిన్ చేయడం లేదని గుర్తించారు. అలాగే స్పా సెంటర్లకు రెంటుకు ఇస్తున్న ఓనర్లను కూడా ఈ సందర్భంగా పోలీసులు విచారించారు. స్పా సెంటర్ల నుంచి రెంట్ తీసుకోవడం తప్ప.. అందులో ఏం జరుగుతుందో కూడా ఓనర్లు పట్టించుకోవడం లేదని పోలీసుల విచారణలో బహిర్గతమైంది. కొన్ని స్పా సెంటర్లలో అక్రమాలు జరుగుతున్నాయని గుర్తించి కూడా.. ఇంటి ఓనర్లు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని పోలీసులు గుర్తించారు. నగరంలోని స్పా సెంటర్ల భారీగా ఉన్నాయి. వీటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ అడపాదడపా పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఆయా ఫిర్యాదుల మేరకు పోలీసులు దాడులు చేస్తున్నారు. సందర్భంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కానీ నగరంలో ఒకే సారి భారీగా స్పా సెంటర్లపై పోలీసులు ఏకకాలంలో దాడులు చేయడం ఇదే ప్రథమం. అలాగే స్పా సెంటర్ల నిర్వహణ విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలని.. పోలీస్ ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు. స్పా ముసుగులో అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా.. వీటికి అడ్డుకట్ట వేయవచ్చని పోలీసులకు ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం

మొదటిపేజీ తరువాయి..

చేపట్టి భానుప్రసాద్‌ను రక్షించారు. మిగిలిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మంజీరా నదిలో ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు నీట మునిగి మృత్యువాత పడ్డారు. బొల్లాక్‌పల్లి సమీపంలోని మంజీరా నదిలో అనిత, పావని, శ్రీవాణి, భాను ఈతకు దిగారు. వీరంతా నదిలో ఊబిలో చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని గమనించిన సమీపంలోని ఒక మహిళ వారిని రక్షించే ప్రయత్నం చేసి తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే ఆమెను రక్షించారు. అలాగే ఊబిలో చిక్కుకున్న మృతదేహాలను స్థానికుల సహాయంతో బయటకు తీశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు బొల్లాక్‌పల్లికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం బాన్సువాడ మండలం బుడిమి గ్రామం వద్ద ఎల్లమ్మ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు పాల్గొన్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేడుక జరిగింది. అనంతరం భోజనాలు చేసిన తర్వాత నలుగురు చిన్నారులు మంజీరా నదిలో ఈత కొట్టేందుకు వెళ్లి.. ఊబిలో చిక్కుకుని మరణించారని పోలీసులు చెప్పారు. వీరంతా 10 ఏళ్ల లోపు వారేనని తెలిపారు. చిన్నారుల మృతితో వారి తల్లిదండ్రులతోపాటు బంధువుల రోదనలు మిన్నంటాయి.

## పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

**– కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ – ఎమ్ ఎల్ ఎ వెడ్మ బొజ్జు పటేల్**





**ఖానాపూర్(పెంబి) జూన్ 5 (ప్రజా జ్యోతి) :** పేదింటి ఆడపడుచులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని పెంబి మండలం ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి,షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పతకాలను ప్రజలు గుర్తించి ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు.రానున్న వర్ష కాలంలో గాలి,వాన,పిడుగుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు,పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీ సర్పంచ్ మల్లేపల్లి స్వామి మండల పార్టీ అధ్యక్షులు గుడిసె నరసయ్య నాయకులు స్వప్న రెడ్డి పుప్పాల శంకర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు యూరియా విక్రయాలు

**– చోద్యం చూస్తున్న వ్యవసాయ అధికారి: రైతుల ఆరోపణ**
**– దుకాణాలపై చర్యలు లేవని సీపీఎం నేత దుర్గం దినకర్ విమర్శ**



**ఆసిఫాబాద్ జూన్ 5 ప్రజాజ్యోతి :** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో కొన్ని ఎరువుల దుకాణాల్లో యూరియాను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ మండల వ్యవసాయ అధికారి నేటివరకు ఆ దుకాణాలను తనిఖీ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ విమర్శించారు. రైతులకు అండగా ఉండాల్సిన అధికారి అవగాహన కల్పించడం లేదని, దుకాణదారులతో సమావేశాలు నిర్వహించి ఆదేశాలు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. మండలంలో ఇలాంటి విషయాలను అధికారి పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, ఎక్కువ ధరకు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, రైతుల పక్షాన నిలవాలని దుర్గం దినకర్ డిమాండ్ చేశారు.

## సిర్పూర్(టి)లో అత్య వసర సేవల 108 అంబులెన్స్‌లా తనిఖీ రికార్డుల పరిశీలన

**– మెడికల్ స్టాక్ చెక్ చేసి కాల్ రాగానే వెంటనే బయలుదేరి ప్రథమ చికిత్స అందించి దగ్గర లో ఉన్న హాస్పిటల్ అడ్మిట్ చేయాలి**
**– ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్**




**జూన్ 5, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలంలో ఉన్నటు వంటి 108 అత్యవసర సేవల అంబులెన్స్‌లను అక్కస్మికంగా తనిఖీ చేసిన ఉమ్మడి అదిలాబాద్ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ రికార్డులను పరిశీలించారు. మెడికల్ స్టాక్ చెక్ చేసి కాల్ రాగానే వెంటనే బయలుదేరి ప్రథమ చికిత్స అందిస్తూ దగ్గర్లో ఉన్న హాస్పిటల్లో అడ్మిట్ చేయాలని సూచించారు. అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ మాట్లాడుతూ .ఈ అత్యవసర సేవలలో ఎటువంటి డివేషన్స్ కలిగిస్తే తగిన చర్యలు తీసుకుందామని సిబ్బందికి తగిన సూచనలు చేశారు.అదేవిధంగా కాకజ్ నగర్ బేస్ లో ఉన్నటువంటి 108,102 అండ్ 1962 అంబులెన్స్ కూడా తనిఖీచేసి సిబ్బంది కి తగిన సూచన చేశారు. ఈ కార్యక్రమంలో 108 మెడికల్ టెక్నీషియన్, కిషోర్ పైలట్ చిరంజీవి తో పాటు 102, 1962, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం



**జన్నారం, జూన్ 5 (ప్రజాజ్యోతి) :** అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ సందర్భంగా శుక్రవారం రోజున జన్నారం రేంజ్ అధికారి బాబా ఖాదర్ వలీ ఆధ్వర్యంలో ఈఈసి నుండి గోండు గూడ గేట్ నెంబర్ వన్ వరకు, ఇందనపల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, రేంజ్ కార్యాలయ ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వారు వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, ప్లాస్టిక్ వాడటం వలన ఆరోగ్యానికి హానికరమని అన్నారు. ప్లాస్టిక్ భూమిలో కరగడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుందని, వాటిని తిని జంతువులు పక్షులు, పశువులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చినప్పుడు విషపూరిత




వాయువులు విడుదలై మానవ ఆరోగ్యానికి హానికరం చేస్తాయని అన్నారు.కావున ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టడానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కు దూరంగా ఉండి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. రానున్న వినాయక చవితికి కూడా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాలను కాకుండా మట్టితో తయారుచేసిన గణపతి పూజించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్.ఎస్.ఓ భోజ్య నాయక్, బీట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవ్వాలి









**– జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 5, (ప్రజాజ్యోతి) :** పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" పర్యావరణ వారోత్సవాలు, అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ వేడుకలు శుక్రవారం మామడ మండలం ఆరేపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులందరికీ పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణ కాలుష్యం కారణంగా నేడు పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వాతావరణ పరిస్థితుల్లో ప్రమాదకరమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. పుట్టినరోజు నాడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వివరించారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కూడా పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని తెలిపారు. రైతులు పంట వ్యర్థాలకు నిప్పు పెట్టవద్దని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడటమే కాకుండా ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు కారణం అవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయ మార్గాలను పాటించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది తమ తమ ఇంటి నుంచే ప్రారంభం అవ్వాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని ప్రతి ఏడాది అడవులు దగ్ధమవుతున్నాయని, దీని ద్వారా పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని అన్నారు. అడవులు కాలిపోకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రతిజ్ఞ చేశారు.

కళాజాత బృందాలు పర్యావరణం పరిరక్షణపై అవగాహన కలిగేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కలెక్టర్, ఇతర అధికారులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, సీనియర్ సివిల్ జడ్జి రవీందర్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఎఫ్డిఓ నాగిని బాను, ఇతర అధికారులు, గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి







**– జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 5, (ప్రజాజ్యోతి) :** బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, శుక్రవారం 2025–26 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికానికి సంబంధించిన డిసిసి, డిఎల్ఆర్ సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకుల సహకారం వల్ల ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని, దీనికోసం కావలసిన సహకారం బ్యాంకులు అందించాలన్నారు. పేద ప్రజల ఉన్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకులతో ముడిపడి ఉన్న ఎన్నో రకాల పథకాలు అమలు పరుస్తున్నాయని, ఇవి క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలందరికీ అందివ్వాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తత, పొదుపు, బ్యాంకింగ్ పై అవగాహన కలిగేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు, వీధి వ్యాపారస్తులకు, విద్యార్థులకు అందించు రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదన్నారు. వివిధ రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధిత రుణాలను అందజేయాలన్నారు. అనంతరం 2026 – 27 వార్షిక రుణ ప్రణాళిక నివేదికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఎస్బిఐ, టిజిబి రీజినల్ మేనేజర్లు రంజన్ కుమార్, నవీన్ కుమార్, ఆర్బిఐ లింక్డ్ బ్యాంకింగ్ ఆఫీసర్ రాములు, ఇతర అధికారులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాల అమలులో తొందరపాటు వద్దు

**సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యులు, బీఎంఎస్ కేంద్ర నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి**






**మంచిర్యాల, 5, జూన్ (ప్రజాజ్యోతి) :** కోల్ ఇండియా సంస్థలో కార్మిక చట్టాల అమలుకు సంబంధించి యాజమాన్యం చేపడుతున్న తొందరపాటు చర్యలను కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యులు, బీఎంఎస్ కేంద్ర నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం జరిగిన అపెక్స్ సమావేశంలో కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) కార్మిక చట్టాలను వేగంగా అమలు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలపై నాలుగు కార్మిక సంఘాల ప్రతినిధులు ఏకగ్రీవంగా అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. దేశంలోని ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ఈ చట్టాలను ఇంత త్వరితగతిన అమలు చేయడానికి ముందుకు రావడం లేదని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిపారు. కార్మికుల వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలంటే ముందుగా జాయింట్ బైపార్టైట్ కమిటీ ఫర్ కోల్ ఇండస్ట్రీ (జేబీసీసీఐ) ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాలని బీఎంఎస్ తరపున యాజమాన్యాన్ని కోరినట్లు లక్ష్మారెడ్డి వెల్లడించారు. కార్మిక చట్టాల అమలుకు సంబంధించిన అంశాలపై యాజమాన్యంతో పాటు అపెక్స్ జేఎస్సీ సభ్యుల మధ్య మరిన్ని చర్చలు కొనసాగనున్నాయని ఆయన తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నది

**– ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు భద్రమైన భవిష్యత్తు**
**– సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి**



**మంచిర్యాల, 5 జూన్ (ప్రజాజ్యోతి) :** సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు భద్రమైన భవిష్యత్తు ఉంటుందని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా.బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు. ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు భద్రమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. వాతావరణ మార్పులు, కాలుష్యం, సహజ వనరుల క్షీణత వంటి సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతితో సమతుల్యతను కాపాడుకోవడం అత్యంత అవసరమని, దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సంస్థ ఇప్పటివరకు 15,796 హెక్టార్ల విస్తీర్ణంలో 5.58 కోట్ల మొక్కలను నాటి హరితీకరణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని, గ్రామీణ ప్రాంతాల్లో 2.32 కోట్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేసినట్లు వివరించారు. గనుల ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యత కోసం గనుల నుంచి వెలువడే నీటిని శుద్ధి చేసి వ్యవసాయ, గృహ అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామని, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, చెరువుల పూడికతీత, ఇంకుడు గుంతల ఏర్పాటు, ఉద్యానవనాల అభివృద్ధి వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. పునరుత్పాదక ఇంధన రంగంలో భాగంగా సంస్థ 245.50 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని, 2026లో మరో 233 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని జోడించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని, మొక్కల పెంపకం, నీటి సంరక్షణ, ఇంధన పొదుపు, వ్యర్థాల తగ్గింపులో అందరూ చురుకుగా పాల్గొనాలని డా. బుద్ధప్రకాష్ జ్యోతి పిలుపునిచ్చారు. పచ్చని, పరిశుభ్రమైన, సుస్థిరమైన భవిష్యత్తు కోసం అందరం కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన కోరారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత





**– బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**

**మంచిర్యాల, 5, జూన్ (ప్రజాజ్యోతి) :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు .ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి 15వ డివిజన్‌లో బీజేపీ శ్రేణులు నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పాల్గొన్నారు. పార్టీ నాయకులతో కలిసి మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్‌ను అరికట్టాలంటే ప్రతి వ్యక్తి మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. చెట్ల పెంపకం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా ఈ మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ హరితహారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్‌కుమార్, దేగ బాపు, మోటపలుకుల తిరుపతి, రాయెల్లి మల్లేష్, అవిడపు రాజాబాబు, రంగ శ్రీశైలం, నాంపల్లి శ్రీనివాస్, నల్ల రవి, బైరం లక్ష్మి, నల్లపు రమేష్, ఆడే ప్రేమ్‌సింగ్, బొలిశెట్టి అశ్విన్, సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లకంపూర్‌లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**– పాల్గొన్న ఎంపీడీవో రమేష్**



**నేరడిగొండ, జూన్ 05 (ప్రజా జ్యోతి) :** మండలంలోని లకంపూర్ (జి) గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సేడమకి సుజాత గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) రమేష్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో మొక్కల పాత్ర కీలకమైందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను, పర్యావరణ సమతుల్యత ప్రాధాన్యతను ఆయన గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్, ఉప సర్పంచ్ రేంగే పూజ, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తర్లపాడులో బడిబాట కార్యక్రమం




**ఖానాపూర్ జూన్ 5 (ప్రజాజ్యోతి) :** ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించే క్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ మండలంలోని తర్లపాడు గ్రామంలో సర్పంచ్ పోలంపల్లి సచిన్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట జరిగింది ఈ సందర్భంగా గ్రామాల్లోని పలు వాడల్లో తిరుగుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సార్ల నరసయ్య ఉపాధ్యాయులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనమే ప్రగతికి పునాది




**మంచిర్యాలరూరల్ జూన్05(ప్రజాజ్యోతి) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఎస్. అనిత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై రూపొందించిన బ్యానర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డా.అనిత మాట్లాడుతూ పర్యావరణాన్ని సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వర్షాకాలాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,ఉపకేంద్రాల పరిధిలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, అవసరం లేని వాహన ప్రయాణాలను తగ్గించి నడకకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే చెట్ల పెంపకం,వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.ప్రసాద్,జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్,అసంక్రమణ వ్యాధుల కోఆర్డినేటర్ కాకిరాల వెంకటేశ్వర్లు, లక్ష్మణస్వామి, శ్రీనివాస్, ఆర్.ఎస్.పద్మ, వసుమతి, రవికిరణ్, సురేందర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వకుంటే ఊరుకునేదే లేదు




**జన్నారం, జూన్ 5 (ప్రజాజ్యోతి) :** రెండవ విడతలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వకుంటే ఊరుకునేదే లేదని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తౌటు సంజీవ్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన కొందరికి ఇందిరమ్మ ఇల్లులు మంజూరు కాగా, కొందరు అధికారులు,రాజకీయ నాయకులు వాటిని వేరే వాళ్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఈసారి కూడా అలా చేస్తే ఊరుకునేది లేదని ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసనకు దిగుతామని హెచ్చరించారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ఎస్పీ ప్రత్యేక చొరవ-ప్రతిరోజూ'ప్రజావాణి'కార్యక్రమం

గద్వాల జూన్ 5(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు కీలక నిర్ణయం తీసుకున్నారు.రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ



కార్యాలయంలో ప్రతిరోజూ (పని దినాల్లో)'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమం కింద ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా ఎస్పీ స్వయంగా ప్రజలకు అందుబాటులో ఉంటారు.ప్రజలు తమ వ్యక్తిగత,సామాజిక,న్యాయపరమైన సమస్యలు,ఫిర్యాదులు,వినతి పత్రాలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించడం,పోలీసు శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలు ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా తమ సమస్యలను నేరుగా వివరించి పరిష్కారం పొందే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించాలని ఎస్పీ టి.శ్రీనివాసరావు సూచించారు.

## పాలమూరు ప్రాంతానికి... కృష్ణ జలాలు పారించడమే లక్ష్యం

-ప్రాజెక్ట్ పనులు నిర్దేశిత.. గడువులో పూర్తి చేయాలి
- అధికారులకు ఆదేశాలు జారీచేసిన
- సీఎం రేవంత్ రెడ్డి

నాగర్ కర్నూల్ జూన్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) ఉమ్మడి పాలమూరు లో కృష్ణ జలాలను పారించి, పాలమూరు ప్రాజెక్టులను నిర్దేశిత గడువులో పూర్తిచేసి, ప్రాంతానికి సాగు, త్రాగునీళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గంలో పరిధిలోని పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లపూర్ ప్యాకేజీ టు ప్యాకేజీ 3 కాల్వల నిర్మాణ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కృష్ణారావు,వాకిటి శ్రీహరి తో కలిసి, క్షేత్ర





స్థాయిలో సందర్శించి పరిశీలించారు. కాల్వ పనుల పురోగతిపై సంబంధిత శాఖ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ చేరుకొని,డెలివరీ సిస్టర్ ను సంబంధిత మంత్రులు ఉన్నత శాఖ అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులను నిర్దేశిత కడువులోగా పూర్తి చేసి, పాలమూరు ప్రాంతానికి సాగు మరియు తాగునీరు అందించాలని మంత్రులకు ఆ శాఖ ఉన్నత అధికారులకు ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని సంకల్పంతో ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణంలో ఎన్ని అవాంతరాలు ఎదురైన, అధిగమించి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతుల సంక్షేమ కొరకు ఎన్నో సంక్షేమ పథకాలు రూపకల్పన చేసి, రైతును రాజు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు,నీటిపారుదల శాఖ ఉన్నత అధికారులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## సేవాభావంతో వైద్య సేవలు అందించాలి

- మేఘన హాస్పిటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి

వనపర్తి, జూన్ 5 (ప్రజాజ్యోతి): వనపర్తి పట్టణంలోని గాంధీచౌక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మేఘన హాస్పిటల్‌ను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ బ్రహ్మం చారి, రమేష్ ఆధ్వర్యంలో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రోజురోజుకు అభివృద్ధి




చెందుతున్న వనపర్తి పట్టణంలో ఆధునిక వైద్య సదుపాయాలు కలిగిన ఆసుపత్రుల అవసరం ఎంతో ఉందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులను ఆశ్రయించే రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్య వృత్తిని వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా భావంతో నిర్వహించాలని పేర్కొన్నారు. భగవంతుడి తర్వాత ప్రజలకు ప్రాణదాతలుగా నిలిచేది వైద్యులేనని, రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, వనపర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరి రాములు, పెబ్బేరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాపర్ల రాంరెడ్డి, పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తాం.. మా చిత్తశుద్ధిని శంకించొద్దు

- బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- "రెండేళ్లు మాట్లాడకపోవడమే వాళ్లు చేసే పెద్ద సాయం"

మహబూబ్‌నగర్, జూన్ 5 ( ప్రజాజ్యోతి బ్యూరో ) : ఉమ్మడి పాలమూరు జిల్లా పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు తామే జవాబు దారులమని, ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కి తగ్గబోమన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కర్వేన ప్యాకేజీ–14,15 రిజర్వాయర్ల పరిశీలన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తం కుమార్ రెడ్డి, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. తెలంగాణ ఏర్పడితే పాలమూరు ప్రాజెక్టులు పూర్తవుతాయని ప్రజలు ఆశించారని, కానీ గత పదేళ్ల పాలనలో రూ.1.81 లక్షల కోట్లు సాగునీటి ప్రాజెక్టుల పేరిట ఖర్చు చేసి అందులో లక్ష కోట్లకు పైగా కాళేశ్వరం కోసమే వెచ్చించారని సీఎం విమర్శించారు. అత్యంత కీలకమైన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. "పంపులు, లిఫ్టుల పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి కమీషన్లు కొల్లగొట్టారు. కానీ ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేకపోయారు" అంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు





గుప్పించారు. ప్రాజెక్టుల కోసం అవసరమైన భూసేకరణ కూడా పూర్తి చేయకుండా పనులు పూర్తవుతాయని ఎలా భావించారని ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలో 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉండేదన్నారు. ప్రస్తుతం ఇంకా నాలుగు వేల ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందని, వచ్చే రెండేళ్లలో పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. "90 శాతం పనులు పూర్తయ్యాయని బీఆర్ఎస్ నేతలు చెప్పడం పచ్చి అబద్ధం. అంచనాల్లో 50 శాతం కూడా ఖర్చు చేయకుండా 90 శాతం పనులు ఎలా పూర్తవుతాయి?" అంటూ సీఎం ఎద్దేవా చేశారు. "ఉన్నదంతా దోచుకుపోయి ఇప్పుడు మమ్మల్ని దోషులుగా చూపే ప్రయత్నం చేస్తున్నారు" అని మండిపడ్డారు. జిల్లా ప్రజలు భూసేకరణకు సహకరించాలని కోరిన సీఎం, "ఇప్పుడే పూర్తి చేయకపోతే ఇక ఎప్పటికీ ఈ పనులు పూర్తి కావు. చరిత్ర మనల్ని క్షమించదు" అన్నారు. "జిల్లా బీఆర్ఎస్ నేతలు రెండేళ్లు ఏం మాట్లాడకపోవడమే వాళ్లు చేసే పెద్ద సాయం" అంటూ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల క్షేత్రస్థాయి పరిశీలన చారిత్రాత్మకమన్నారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ రంగాన్ని పూర్తిగా నాశనం చేసిందని విమర్శించారు. రూ.22 వేల కోట్లు ఖర్చు చేసినా పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరానికీ సాగునీరు అందలేదన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా పోరాడుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ విస్తీర్ణం, పంట ఉత్పత్తి, ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలో ముందువరుసలో ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి, మధుసూధన్ రెడ్డి, కుచుకుల్ల రాజేష్ రెడ్డి, మేఘా రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యకర్తలు ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలి: జిల్లా అధ్యక్షుడు టి. రామాంజనేయులు

గద్వాల జూన్ 5(ప్రజా జ్యోతి ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ శిబిరం గద్వాల పట్టణంలోని ఎస్వీ ఈవెంట్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు టి.రామాంజనేయులు అధ్యక్షతన రెండు రోజులపాటు ఘనంగా జరిగింది.జూన్ 4,5 తేదీలలో నిర్వహించిన ఈ శిక్షణ శిబిరంలో జిల్లా నలుమూలల నుంచి సుమారు 250 మంది పార్టీ ప్రతినిధులు, పదాధికారులు,కార్యకర్తలు పాల్గొన్నారు.శిబిరం ముగింపు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టి.రామాంజనేయులు మాట్లాడుతూ,భారతీయ జనతా పార్టీ దేశంలో కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాకుండా జాతీయ పునర్నిర్మాణానికి అంకితమైన ఉద్యమంగా ఎదిగిందన్నారు.పార్టీ సిద్ధాంతాలు,విలువలు,క్రమశిక్షణ,సేవా భావంతో కార్యకర్తలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు.ఈ శిక్షణ శిబిరంలో పార్టీ సిద్ధాంతిక భూమిక,బీజేపీ చరిత్ర వికాసం,కార్య విస్తరణ,కార్యపద్ధతి,భావజాల పరివార క్షేత్రాలు,కార్యకర్తల వికాసం,బాధ్యతలు,దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, సామాజిక సవాళ్లు,మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు,సోషల్ మీడియా ప్రాముఖ్యత, నూతన సాంకేతిక పరిజ్ఞానం,మీడియా నిర్వహణ,బూత్ నిర్వహణ,మన్ కీ బాత్, ఎస్ఐఆర్,గీత్ తదితర 12 అంశాలపై రాష్ట్ర పార్టీ నుంచి వచ్చిన వక్తలు



సమగ్రంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై విశిష్ట స్థానాన్ని సంపాదించిందని,కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.దేశం ఎదుర్కొంటున్న సామాజిక,రాజకీయ,ఆర్థిక సవాళ్లను అర్థం చేసుకొని ప్రజలకు సరైన దిశానిర్దేశం చేయగల నాయకత్వాన్ని కార్యకర్తలు పెంపొందించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ బాపు రెడ్డి,బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి,జిల్లా శిక్షణ ప్రభారి రామచంద్ర రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శులు రవికుమార్ ఎక్బోటే,కేకే రెడ్డి,శ్యాంరావు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బండల వెంకటరాములు,అక్కల రమాదేవి,మాజీ ఎమ్మెల్యే అభ్యర్థులు బలిగేర శివారెడ్డి,రాజగోపాల్,మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు టి.కృష్ణవేణి,బండల పద్మావతి,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ,కౌన్సిలర్లు కుమ్మరి శ్రీను,శాలన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లో త్వరగా నగదు జమయ్యేలా చర్యలు

- వరి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ ఆదర్శ్ సురభి సమీక్ష

వనపర్తి ప్రతినిధి, జూన్ 5 (ప్రజాజ్యోతి): వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేసి, రైతుల ఖాతాల్లో వీలైనంత త్వరగా నగదు జమయ్యేలా చర్యలు




తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వరి ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల వారీగా ధాన్యం సేకరణ, ట్యాబ్ ఎంట్రీలు, రవాణా ప్రక్రియలపై ఆరా తీసి అధికారులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే కాంటా పూర్తై రవాణాకు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని వెంటనే తరలించేలా అవసరమైన లారీలను సమకూర్చాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. అవసరమైన వాహనాలను అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో నేటి నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు ఏర్పాటు చేయడంతో పాటు, వాహనాల్లో లోడ్ చేసిన ధాన్యాన్ని కూడా టార్పాలిన్లతో కప్పి భద్రపరచాలని ఆదేశించారు. ఏయే కొనుగోలు కేంద్రాలకు ఎన్ని వాహనాలు అవసరమో తెలుసుకుని,

ధాన్యం రవాణాకు తగినన్ని లారీలను సిద్ధంగా ఉంచాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లకు సూచించారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులు ట్యాబ్ ఎంట్రీలను త్వరితగతిన పూర్తి చేసి, రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని విధాల చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, జిల్లా పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్ ఆంజనేయులు, డీఆర్‌డీఓ ఉమాదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

## పాలమూరు-రంగారెడ్డి పనులు వేగవంతం చేస్తాం

- ఉదండాపూర్ రిజర్వాయర్ పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 5 (ప్రజాజ్యోతి బ్యూరో ) : పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల నీటిపారుదల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి తెలిపారు.

శుక్రవారం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన అనంతరం ఉదండాపూర్ రిజర్వాయర్‌ను సీఎం సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీ, మ్యాపులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రధాన ట్రంక్‌లో భాగమైన ఉదండాపూర్ జలాశయం ఐదవ రిజర్వాయర్‌గా నిర్మాణంలో ఉంది. ప్యాకేజీ–16, 17, 18ల కింద చేపట్టిన ఈ పనులకు మొత్తం రూ.7,802.91 కోట్లు అంచనా వ్యయం కాగా, ఇప్పటివరకు రూ.5,126.59 కోట్ల పనులు పూర్తి అయ్యాయి. అంటే సుమారు 65.70 శాతం పనులు పూర్తైనట్లు అధికారులు సీఎంకు వివరించారు. మిగిలిన రూ.2,675.91 కోట్ల పనులను జూలై–2027 నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ జలాశయం ద్వారా దక్షిణ ప్రధాన కాలువతో కలిపి 9,36,685 ఎకరాలకు సాగునీరు అందనుంది. ప్యాకేజీ–16 కింద మెస్సర్స్ ఎన్ఈసీ–ఆర్విఆర్ (జేవీ), హైదరాబాద్ సంస్థ రూ.4,315.32 కోట్ల



పనులను చేపట్టగా, ఇప్పటివరకు రూ.3,053.29 కోట్ల పనులు పూర్తయ్యాయి. మిగిలిన రూ.1,262.03 కోట్ల పనులు కొనసాగుతున్నాయి. అవసరమైన 354 ఎకరాల భూమిలో 346 ఎకరాలకు పైగా భూసేకరణ పూర్తయింది. ప్యాకేజీ–17లో మెస్సర్స్ హెచ్ఈఎస్–హర్ష (జేవీ), హైదరాబాద్ సంస్థ రూ.736.08 కోట్ల పనులను నిర్వహిస్తుండగా, రూ.501.74 కోట్ల పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన రూ.234.34 కోట్ల పనులు కొనసాగుతున్నాయి. అవసరమైన 1,678 ఎకరాల భూమిలో 1,667 ఎకరాలకు పైగా భూసేకరణ పూర్తయింది. ప్యాకేజీ–18లో మెస్సర్స్ మెయిల్–హెస్ (జేవీ), హైదరాబాద్ సంస్థ రూ.2,751.51 కోట్ల పనులు చేపట్టగా, రూ.1,571.96 కోట్ల పనులు పూర్తయ్యాయి. మిగిలిన రూ.1,179.55 కోట్ల పనులు కొనసాగుతున్నాయి.

అవసరమైన భూమి సేకరణ కూడా దాదాపు పూర్తయినట్లు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఎన్ ఉత్తం కుమార్ రెడ్డి జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు అనిరుధ్ రెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, మధుసూదన్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణ రెడ్డి, మేఘా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## "పాలమూరు ప్రజలు మట్టి తీసుడే కాదు.. మట్టితో కప్పడం కూడా తెలుసు"

- జడ్చర్ల సభలో కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- "పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేసి రైతుల బతుకులు మార్చుతాం"

జడ్చర్ల, జూన్ 5 ( ప్రజాజ్యోతి బ్యూరో ) : "మీ పాలమూరు బిడ్డగా రెండురోజులుగా జిల్లా రైతుల కోసం సాగునీటి ప్రాజెక్టులను పరిశీలిస్తున్నా. వలసల కష్టాలు, రైతుల ఆత్మహత్యల బాధలు నాకు తెలుసు" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావోద్వేగంగా మాట్లాడారు.

జడ్చర్లలో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక బహిరంగ సభలో సీఎం పాల్గొని మాట్లాడారు. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల జీవితాల్లో వెలుగు నింపడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

"పాలమూరులో ఊరు లేకపోయినా, పార్లమెంట్‌లో నోరు లేకపోయినా రాజకీయంగా ఇక్కడికి వచ్చిన కేసీఆర్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. కానీ పదేళ్ల పాలనలో పాలమూరు జిల్లాలో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదు" అంటూ మాజీ







ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. "పాదయాత్రలు చేస్తామంటున్నారు.. పాదయాత్ర కాదు, కాశీ వరకు పొర్లు దండాలు పెట్టినా మీరు చేసిన పాపాలు పోవు" అని వ్యాఖ్యానించారు. "పాలమూరులో గెలిచి గజ్వేల్‌కు పారిపోయిన కేసీఆర్ పాలమూరు ద్రోహినా? నేను పాలమూరు ద్రోహినా?" అని ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. "మీ పాలమూరు బిడ్డగా ఈ 30 నెలల్లోనే జిల్లా ప్రాజెక్టుల కోసం రూ.8 వేల కోట్లు ఖర్చు చేశా" అని తెలిపారు. ఉద్దండాపూర్ నిర్వాసితులకు గత ప్రభుత్వం న్యాయం చేయలేదని ఆరోపించిన సీఎం, "ఉద్దండాపూర్ మునిగితే రూ.800 కోట్లు కూడా ఇవ్వలేదు. పైగా నిర్వాసితులను జైళ్లలో పెట్టి కొట్టించారు" అంటూ మండిపడ్డారు. విద్య రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, కొడంగల్‌లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నామని చెప్పారు. "చదువొక్కటే జీవితాల్లో వెలుగు నింపుతుంది. పిల్లల్ని బాగా చదివించండి" అని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను కూడా సీఎం ప్రస్తావించారు. "15 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేశాం" అన్నారు.

"మేం చేసింది చెప్పాలంటే రాస్తే రామాయణం.. చెబితే భారతం" అంటూ వ్యాఖ్యానించిన సీఎం, "మీ పదేళ్ల పాలనపై, మా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దాం.. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి" అని సవాల్ విసిరారు. గోదావరి జలాల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం, బీజేపీ నేతలు సహకరించడం లేదని ఆరోపించిన సీఎం, "ఎవరు తప్పించుకున్నా అడుగుతాం.. కడుగుతాం.. తుమ్మిడిహెట్టి కట్టి తీరుతాం" అని స్పష్టం చేశారు."2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుంది. 2029లో మళ్లీ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు. "ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్" అంటూ ప్రసంగాన్ని ముగించారు.

## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా బచ్చు రాము

వనపర్తి, జూన్ 5 (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ శుక్రవారం వనపర్తి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బచ్చు రాముకు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పేద ఆర్యవైశ్యులు, విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. సమాజ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసి ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని



ఆకాంక్షించారు. బచ్చు రాము మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఆర్యవైశ్యులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా ముందుండి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పేద ఆర్యవైశ్య కుటుంబాలు, విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, సమాజ అభ్యున్నతికి నిరంతరం సేవలందిస్తానని పేర్కొన్నారు. ఆర్యవైశ్య మహాసభ ఆశయాలకు కట్టుబడి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు రమేష్ చంద్ర, లెగిసెట్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మానవాలి మనుగడకు చెట్లే ఆధారం

**– ఎన్సిసి అధికారి రాజయ్య**







**ప్రజాజ్యోతి–మొగుళ్ళ పల్లి (జూన్ 05) :** మానవాలి మనుగడకు చెట్లే ఆధారమని చెట్లను పెంచి భావితరాలకు నీడనివ్వండని ఎన్సిసి అధికారి గుండెల్లి రాజయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ సందర్భంగా పదవ తెలంగాణ బెటాలియన్ వరంగల్ కమాండింగ్ ఆఫీసర్ కలనల్ సెంతిల్ రామదురై, పరిపాలనాధికారి కలనల్ రవి సునారే ఆదేశానుసారం శుక్రవారం మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఎన్సిసి విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓన్లీ వన్ ఎర్త్ (ఒకే ఒక భూమి) అనే నినాదంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 5న జరుపుకుంటామని గాలి, నీరు, నింగి, నిప్పు, నేల వల్లనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. వీటిలో ఏ ఒక్కటి లోపించిన మానవుడి జీవనం అస్తవ్యస్తమవుతుందన్నారు. భూమిపై సక్రమంగానే ఉన్న సహజ వనరులను మానవుల స్వార్థ రాజకీయ అనాలోచిత నిర్ణయాల వల్ల విచ్చలవిడిగా వినియోగిస్తున్న క్లోరోఫ్లోరో,కార్బన్ రసాయనాల వల్ల ప్లాస్టిక్ వల్ల అభివృద్ధి చెందిన దేశాల ఆధిపత్య దాహం వల్ల పంచభూతాలను కాలుష్యకారకంగా మారుస్తున్నాయన్నారు. ఉపరితల వనరులతో పాటుగా భూగర్భ జలాలు ఖనిజ సంపద విచక్షణ రహితంగా వాడకం వల్ల రానున్న రోజుల్లో కాలుష్యం పెరిగి సహజ వనరులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకై ఎన్సిసి విద్యార్థులందరూ,దీక్షతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి వాటిని రక్షించాలని మనమే కాకుండా మన చుట్టుపక్కల వాళ్లకు అవగాహన కల్పించి మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు టి వెంకన్న, సిఆర్పి రాజయ్య, సిఆర్పి శ్రీనివాస్, అటెండర్ మజార్ ఎన్సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

## సంగెం గ్రామసభకు అధికారులు గైర్హాజరు

**-ప్రజల ఆగ్రహం**

**– ఇదేమి పరిపాలన..అంటూ ముక్కున వేలేసుకున్న గ్రామస్తులు**
**– గాడి తప్పుతున్న పాలనపై ఆందోళన**



**సంగెం, జూన్ 05 (ప్రజాజ్యోతి) :** సంగెం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనంలో సర్పంచ్ పేర్ల లలిత రమేష్ యాదవ్,పంచాయతీ కార్యదర్శి టి.రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పట్టింది. గ్రామంలోని వివిధ సమస్యలపై చర్చించేందుకు,ప్రజల ఇబ్బందులను తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ కీలక సమావేశానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు ఎవరూ హాజరుకాకపోవడంతో స్థానిక ప్రజలు,వివిధ పార్టీల నాయకులు,వార్డు సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఇదేమి గ్రామసభ..? :** గ్రామానికి వస్తున్న నిధులు,జరుగుతున్న పనుల గురించి ఏ అధికారిని అడుగుదామన్నా ఒక్కరంటే ఒక్కరు కూడా అందుబాటులో లేకపోవడంతో గ్రామస్తులు "ఇదేమి గ్రామసభ" అంటూ ముక్కున వేలేసుకున్నారు.అధికారులు పెద్ద ఎత్తున దుమ్మా కొట్టడంతో,"ఈ గ్రామసభకు వస్తే మన సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి మనకు ఏమి న్యాయం జరుగుతుంది" అని గ్రామస్తులు చౌరస్తాల్లో,వివిధ సెంటర్లలో చర్చించుకుంటూ వాపోయారు.ఇప్పటికైనా గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆలోచించి ప్రజలకు న్యాయం చేసే విధంగా పరిపాలన సాగించాలని, లేదంటే పాలన పూర్తిగా గాడి తప్పుతుందని గ్రామస్తులు హెచ్చరించారు.

**ప్రభుత్వ ఆశయాలకు గండి కొడుతున్న అధికారులు :** ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నప్పటికీ, సంగెంలో మాత్రం అధికారులు ఒంటెద్దు పోకడతో వ్యవహరిస్తున్నారని నాయకులు విమర్శించారు. గ్రామ సభలను ఆదర్శంగా తీసుకోవాల్సిన అధికారులే ఇలా దుమ్మా కొట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, మండల కేంద్రంలో గ్రామసభలు నిర్వహించేటప్పుడు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు సభ్యురాలు గుండేటి లత,3వ వార్డు సభ్యుడు గోళ్ళ సందీప్, 6వ వార్డు సభ్యుడు మెట్టిపెల్లి కృష్ణ,9వ వార్డు సభ్యురాలు గుండేటి సునీత, కాంగ్రెస్ నాయకులు గుండేటి రాజేష్,12వ వార్డు మాజీ సభ్యుడు రాయపురం సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటే కఠిన చర్యలు తప్పవు

**– సంగెం ఎస్ఐ వంశీకృష్ణ**
**– నల్లబెల్లి గ్రామంలో గుట్కాలు అమ్ముతున్న మహిళ పై కేసు నమోదు**
**– పాఠశాలల వద్ద గుట్కాలు అమ్మితే షాపులు సీజ్**
**– రూ.1,310 విలువైన గుట్కాలు స్వాధీనం**




**సంగెం, జూన్ 05 (ప్రజాజ్యోతి) :** పాఠశాలలు,విద్యాసంస్థల సమీపంలో నిషేధిత పొగాకు,గుట్కా ఉత్పత్తులను విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సబ్ ఇన్స్పెక్టర్ వంశీకృష్ణ హెచ్చరించారు.శుక్రవారం రోజున ఉదయం మండల కేంద్రమైన నల్లబెల్లి గ్రామంలోని ఒక పాఠశాల సమీపంలో గుట్కాలు, సిగరెట్లు విక్రయిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు.ఎస్ఐ వంశీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..నల్లబెల్లి గ్రామంలోని పాఠశాలకు అతి సమీపంలో నిషేధిత ఉత్పత్తులు అమ్ముతున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది.ఈ మేరకు ఎస్ఐ వంశీకృష్ణ నేతృత్వంలో కానిస్టేబుళ్లు వీరన్న,కమురుద్దీన్‌లతో కూడిన పోలీస్ బృందం గుగులోతు పద్మకు చెందిన కిరాణా షాపుపై రైడ్ చేసింది.ఈ తనిఖీల్లో రూ.1,310 విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లు,సిగరెట్ ఉత్పత్తులు లభ్యమయ్యాయి.దీంతో పోలీసులు వాటిని తక్షణమే స్వాధీనం చేసుకుని,నిందితురాలు పద్మను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఆమెపై చట్టప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.పాఠశాలలు,కళాశాలలు,బాలల వసతి గృహాల పరిసరాల్లో సిగరెట్లు, గుట్కాలు, ఇతర పొగాకు ఉత్పత్తులను విక్రయించడం చట్టవిరుద్ధమన్నారు. విద్యార్థులు, యువత భవిష్యత్తును నాశనం చేసే ఇలాంటి వ్యసనపదార్థాలను విక్రయిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ విక్రయాలకు పాల్పడితే సదరు దుకాణాలను పూర్తిగా సీజ్ చేయిస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

# గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్న ప్రభుత్వం

**– 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు పనులు ప్రారంభం**
**– గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**





**రాయపర్తి జూన్ 5 ప్రజా జ్యోతి :** మారు మూల గిరిజన తండాల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతకు ఇస్తున్నదని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐ టి డి ఏ) ఏటూరు నాగారం ఆధ్వర్యంలో మంజూరైన అభివృద్ధి పనుల్లో భాగంగా రాయపర్తి మండలం సూర్యతాండలో పి ఆర్ రోడ్డు నుండి చక్రుతండా వరకు నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు స్థానిక శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ఘనంగా శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగారూ. 40 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ బిటి రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన తండాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజల రవాణా సమస్యలు తగ్గడంతో పాటు విద్య, వైద్యం మరియు ఇతర అవసరాలకు ప్రజలు సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. సూర్యతాండ -- చక్రుతండా ప్రాంత ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న ఈ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తన లక్ష్యమని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధే తన ఏకైక లక్ష్యం

**– రాయపర్తి మండలంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సుడిగాలి పర్యటన – పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన**
**– కొండూరు ఆర్ అండ్ బి రోడ్డు నుండి బొజ్జ తండా వరకు 243. 44 లక్షల రూపాయలతో నిర్మాణ పనులకు శంకుస్థాపన**
**– గిరిజన తండాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత – గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారుల నిర్మాణం ఎంతో కీలకం**
**– పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**







**రాయపర్తి జూన్ 5 ప్రజా జ్యోతి :** పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా రాయపర్తి మండల పరిధిలో చేపట్టిన బిటి రోడ్డు నిర్మాణ పనులకు పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి శుక్రవారం పాల్గొని ఘనంగా శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామ ప్రజల సమక్షంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. రాయపర్తి మండలంలోని కొండూరు గ్రామంలో ఆర్‌డబి రోడ్డు నుండి భోజ్యా తండా వరకు నిర్మించనున్న బిటి రోడ్డు పనులను ఎస్ టి ఎస్ డి ఎఫ్ 2025–26 నిధుల ద్వారా చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి మొత్తం రూ. 2.43.44 లక్షల వ్యయం మంజూరైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారుల నిర్మాణం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో మండల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడటంతో పాటు రైతులకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల నాయకులు రవీందర్ రెడ్డి, ఆమ్య నాయక్ , టిపిసిసి మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి,అధికారులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు

# ఆర్థిక భరోసా కల్పించడమే కళ్యాణ లక్ష్మి పథకం లక్ష్యం

**– మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం**
**– 25 మంది లబ్ధిదారులకు 25 లక్షల 2 వేల 900 రూపాయల చెక్కుల పంపిణీ**
**– పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**





**రాయపర్తి జూన్ 5 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని ఎంపీడీ ఓ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఇటీవల వివాహాలు చేసుకుని కళ్యాణ లక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకుని మంజూరైన పథకం లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల చెక్కులను స్థానిక శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోమండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 25 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 25 లక్షల 02 వేల 900 రూపాయల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, ముఖ్యంగా మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఎఫ్ఎసి కుచన ప్రకాష్, చంద్రమోహన్ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### బిసిఐ ప్రాజెక్ట్ ప్రజ్వల్ ఎఫ్పిసిఎల్"..ఆధ్వర్యంలో

# ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

**– పర్యావరణాన్ని కాపాడటం అందరి బాధ్యత**
**– మొక్కలు నాటి,ప్రతిజ్ఞ చేసిన నల్లబెల్లి గ్రామ సర్పంచ్ మెరుగు హేమలత-వీరేశం**







**సంగెం, జూన్ 05 (ప్రజాజ్యోతి) :** మండలంలోని నల్లబెల్లి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.బిసిఐ ప్రాజెక్ట్ 'ప్రజ్వల్ ఎఫ్‌పిసిఎల్' నల్లబెల్లి గ్రామపంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెరుగు హేమలత వీరేశం పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించి,అవగాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పియు ఇంచార్జ్ నాగరాజు మాట్లాడుతూ. .ప్రతి సంవత్సరం జూన్ 5న పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటామని,మన చుట్టూ ఉన్న గాలి,నీరు, నేల, చెట్లు, జంతువుల వంటి పంచభూతాల కలయికే పర్యావరణమని అన్నారు.ఇవి లేకపోతే మానవాళి మనుగడ సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.గీసుకొండ పియు మేనేజర్ ఆయేషా మాట్లాడుతూ..ప్రస్తుత రోజుల్లో గాలి, నీటి కాలుష్యం, అడవుల నరికివేత, ప్లాస్టిక్ వ్యర్థాలు మన భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు.మనం ప్రకృతిని నాశనం చేస్తే, ప్రకృతి మనల్ని క్షమించదన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక చెట్టు నాటాలని, నీటిని వృథా చేయకుండా, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.నల్లబెల్లి గ్రామ సర్పంచ్ మెరుగు హేమలత వీరేశం మాట్లాడుతూ..ప్రకృతి మనకు ఎంతో ఇస్తోందని, దానికి మనం తిరిగి మేలు చేయాలని కోరారు. చిన్న చిన్న చర్యలతోనే పెద్ద మార్పు తీసుకురావచ్చునని, గ్రామంలోని ప్రతి కుటుంబం ఏటా మొక్కలు నాటాలని అన్నారు. భూగర్భ జలాలు పెంచడానికి ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్ (పంటకుంటలు) ఏర్పాటు చేసుకోవాలని, ప్లాస్టిక్ ని పూర్తిగా నివారించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రెటరీ, ఫీల్డ్ అసిస్టెంట్, ప్రజ్వల సంస్థ కార్యకర్తలు శ్రవణ్, అనిల్, రమాదేవి, స్వరూప, సంగీత, భవాని, రాజేందర్, విజయ్, అనిల్, వేణు, గ్రామ ప్రజలు, రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ కార్పొరేటర్‌ను పరామర్శించిన నాగుర్ల



**హన్మకొండ జిల్లా ప్రతినిధి, జూన్ 05, (ప్రజా జ్యోతి) :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్ సోదా కిరణ్ సతీమణి షాలిని ఆకస్మిక మృతిపై తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం సోదా కిరణ్ నివాసానికి వెళ్లిన ఆయన, షాలిని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సోదా కిరణ్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి కూడా పాల్గొని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. షాలిని మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## మొక్కలు నాటండి.. భవిష్యత్ తరాలను కాపాడండి



**నర్సంపేట జూన్ 5 (ప్రజా జ్యోతి) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఏ.ఎస్.ఆర్ సేవా స్వచ్ఛంద

సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్ ఆధ్వర్యంలో, రెవెన్యూ డివిజన్ ఆఫీసులో ఆర్డిఓ ఉమారాణి మొక్కలునాటారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ తరాలను రక్షించడానికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలనువదిలేయకుండ వాటిని రక్షించాలనిపిలుపునిచ్చారు. వచ్చే తరాలకుమనమిచ్చే కానుక. ఒక మొక్క అని అన్నారు. – అలాగే ప్రతి పౌరుడి ఆరోగ్యరక్షణకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్,వాడొద్దన్నారు. గాలి, నీరు, భూమినికలుషితం, చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కన్స్యూమర్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గిరిగాని సుదర్శన్ గౌడ్,స్వయం కృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్,సంస్థ సభ్యులు వెంకటాచారి ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విగ్రహా ప్రతిస్టాపనకు నాగుర్ల వెంకన్నకు ఆహ్వానం



**పరకాల, జూన్ 05, (ప్రజా జ్యోతి) :** పరకాల మున్సిపాలిటీ పరిధిలోని విలీన సీతారాంపురం గ్రామంలో శ్రీలక్ష్మీ భూలక్ష్మీ సహిత నాభిశిలా (బొడ్రాయి), పోచమ్మ, దుర్గమ్మ, మైసమ్మ గ్రామదేవతలతో పాటు నాగేంద్ర, నవగ్రహ నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు పరకాల మున్సిపాలిటీ పరిధిలోని విలీన సీతారాంపురం గ్రామ బొడ్రాయి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మహోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ మరియు తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ నాగుర్ల వెంకన్నను ప్రత్యేకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా బొడ్రాయి కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రజలంతా సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కమిషనర్‌ను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



**పరకాల, జూన్ 05, (ప్రజా జ్యోతి) :** పరకాల మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పోతరాజు పవన్‌ను బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ డైరెక్టర్ పంచగిరి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ నక్క చిరంజీవి మాట్లాడుతూ పరకాలకు గ్రేడ్–1 అధికారి రావడం సంతోషకరమన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఇన్‌చార్జి పాలన కారణంగా పట్టణ అభివృద్ధి కొంత మేర వెనుకబడిందని, నూతన కమిషనర్ నాయకత్వంలో పరకాల మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాములమ్మ మృతి బాధాకరం

### కోదాడమాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

మునగాల జూన్ 05 (ప్రజా జ్యోతి):
మునగాల మండలం నేలమరి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జలగం నాగేందర్ మాతృమూర్తి రాములమ్మ అకాల మరణం



చెందడం పట్ల కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన నేలమరి గ్రామానికి వెళ్లి రాములమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జలగం నాగేందర్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి వారి దుఃఖంలో తాను భాగస్వామినని తెలిపారు. రాములమ్మ మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. అలాగే, రాములమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం, ఆత్మస్థైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా తమ సంతాపాన్ని తెలియజేశారు.

## పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం

మొనగాల జూన్ 05 (ప్రజాజ్యోతి):
పర్యావరణ పరిరక్షణతో పాటు హరితహారం లక్ష్యాల సాధనలో భాగంగా మునగాల మండలం నారాయణ గూడెం గ్రామంలో సర్పంచ్ కాంపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా



నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించి, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచినప్పుడే హరితహారం లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు గ్రామ ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ, పచ్చదనం పెంపొందించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పాల్గొని మొక్కలు నాటారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలి



మోత్కూరు, జూన్ 5 (ప్రజా జ్యోతి):
సీడ్ టాస్క్ ఫోర్స్ టీం వ్యవసాయ అధికారి పాండురంగ చారి శుక్రవారం మోత్కూర్ మండలంలోని పలు డీలర్ల వద్ద పత్తి, వరి విత్తనాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ ను తనిఖీ చేయడం జరిగింది. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఆదేశించడం జరిగింది. రైతులు లైసెన్సు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు, రసీదు తప్పనిసరిగా తీసుకొని పంటకాలం పూర్తయ్యేంతవరకు భద్రపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి. కీర్తి ఉన్నారు

## కృంగిన చెరువు కట్టను బాగు చేయాలి

మోత్కూరు, జూన్ 5 (ప్రజా జ్యోతి):
మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని చెరువు కట్ట దగ్గర భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మోత్కూరు పట్టణ శాఖ ఆధ్వర్యంలో కుంగిన చెరువు కట్టను శుక్రవారం పరిశీలించడం జరిగింది. గత వర్షాకాలంలో కుంగిన చెరువు కట్టను ఈ వర్షాకాలం సమీపిస్తున్న కూడా ఇంత వరకు ఎలాంటి మరమ్మతులు చేయక పోవడం ఏమిటని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్ ప్రభుత్వాన్ని, అధికారులను ప్రశ్నించారు. ఈ చెరువు కట్ట మీద నుండి అనేక వాహనాలు , బైకులు వందలాది బస్సులు నిత్యం వెళ్తూ



ఉంటాయనీ, కుంగిన చెరువు కట్టను మరమ్మతు చేయకపోతే భారీ ఎత్తున ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం , అధికారులు స్పందించి తక్షణమే చెరువు కట్ట మరమ్మతులను పూర్తి చేయాలని వెంకట్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గీతా పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య , మోత్కూర్ మండల సహాయ కార్యదర్శి, పులకరం మల్లేష్ , పట్టణ సహాయ కార్యదర్శి గొలుసుల యాదగిరి, బీసీ సంఘం మండల కార్యదర్శి పెండెం వెంకటేశ్వర్లు , నిల్గొండ అశోకు, బొడ్డుపల్లి వెంకన్న కడమంచి వీరస్వామి, సీనియర్ నాయకులు తాడూరు లక్ష్మీనరసయ్య, ఎడ్ల ఆనందు తదితరులు పాల్గొన్నారు.

## చెర్లగూడెం భూనిర్వాసితులను తక్షణమే ఆదుకోవాలి

### సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ యువ నాయకుడు మాదగోని మహేష్ గౌడ్ బహిరంగ లేఖ!

### పదేళ్లు దాటినా అందని ఆర్అండ్ఆర్ ప్యాకేజీ..

### సర్వస్వం కోల్పోయిన బాధితులకు ప్రజా ప్రభుత్వమే న్యాయం చేయాలని విజ్ఞప్తి

మర్రిగూడ, జూన్ 05(ప్రజా జ్యోతి ):
నల్గొండ జిల్లా మర్రిగూడ మండలంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చెర్లగూడెం ప్రాజెక్టు భూనిర్వాసితుల దశాబ్ద కాలపు గోసను ఆలకించి, వారికి తక్షణమే న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మాదగోని మహేష్ గౌడ్




రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి వినమ్రపూర్వక లేఖ రాశారు. ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన వందలాది కుటుంబాలు నేటికి పునరావాసం దక్కక వీధిన పడే పరిస్థితి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.చెర్లగూడెం ప్రాజెక్టు నిర్మాణం కోసం స్థానిక ప్రజలు తమ సొంత ఇళ్లను, సాగు భూములను ప్రభుత్వానికి అప్పగించి సర్వస్వం కోల్పోయారని మహేష్ గౌడ్ లేఖలో పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మించి దాదాపు 10 సంవత్సరాలు గడుస్తున్నా, గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల అర్హులైన నిర్వాసితులకు అందవలసిన ఆర్అండ్ఆర్,పునరావాసం,ప్యాకేజీ ఇంకా పూర్తి స్థాయిలో అందలేదని గుర్తుచేశారు. జీవనోపాధి కోల్పోయి, తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న బాధితులు, తమకు న్యాయం జరుగుతుందని ఏళ్ల తరబడి ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని వివరించారు.
రాష్ట్రంలో ఏర్పడిన ఇందిరమ్మ రాజ్యంలో, ప్రజా ప్రభుత్వంపై ఈ పేద భూనిర్వాసితులు గంపెడు ఆశలు పెట్టుకున్నారని మహేష్ గౌడ్ తెలిపారు. ఈ సమస్యను ప్రత్యేకంగా పరిశీలించి, ముఖ్యమంత్రి తక్షణమే అధికారులను ఆదేశించి ఈ క్రింది చర్యలు చేపట్టాలని ఆయన చేతులెత్తి వినమ్రంగా వేడుకున్నారు.పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నిధులను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలని,అర్హులందరికీ పూర్తి పరిహారం,ఇళ్లు, భూములు కోల్పోయిన ప్రతి ఒక్క అర్హత కలిగిన కుటుంబానికి ఎలాంటి అన్యాయం జరగకుండా పూర్తి స్థాయిలో పరిహారం అందేలా చూడాలని,సర్వస్వం కోల్పోయిన నిర్వాసిత కుటుంబాల భవిష్యత్తుకు వారి పిల్లల ఉపాధికి తగిన భరోసా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## శిథిలమైన లో లెవెల్ పాత రోడ్డు పరిశీలన

మోత్కూరు, జూన్ 5 (ప్రజా జ్యోతి):
మోత్కూర్ మండలము పొడిచేడు – అమ్మనబోలు గ్రామాల మధ్యన మూసి నదిలో ఉన్న శిదిలమైన లోలెవెల్ పాత రోడ్డును సూర్యాపేట జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు శుక్రవారం సందర్శించి పరిశీలించినారు. మూసి వరదలు వచ్చిన ప్రతి సంవత్సరము శిదిలమైన రోడ్డులో మనుషులు, పశువులు, గొర్రెలు చిక్కుకొని చనిపోయాయని, ఇప్పటివరకు ఆరుగురు మనుషులు చనిపోయారని గ్రామస్తులు అధికారులకు తెలిపారు. లోలోవెల్ పాత రోడ్డును పూర్తిగా తొలగించి బ్రిడ్జి క్రింద సుమారు 500 మీటర్ల దూరములో చెక్ డ్యామ్ నిర్మించి రైతులకు సాగునీటి వసతి కల్పించాలని సూచించినారు. తక్షణమే ఎస్టిమేట్ వేసి పంపించాలని క్రింది అధికారులను నీటిపారుదల శాఖ సిఈ నాగభూషణము ఆదేశించినారు. వీరి వెంట జిల్లా ఎస్ ఈ శివదర్మ తేజ, ఈ ఈ సత్యనారాయణ, ఏ ఈ లు చంద్రశేఖర్, విక్రమ్, హరీష్, పొడిచేడు గ్రామ సర్పంచ్ జిట్ట సైదులు, ఉప సర్పంచ్ బండ లింగయ్య, డిసిసి ఉపాధ్యక్షులు వంగాల సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ కప్పే వెంకన్న, వార్డు సభ్యులు చిందాల బీరుమల్లు, నల్ల రామనర్సయ్య, ఎనిగె మచ్చగిరి, ఫీల్డ్



అసిస్టెంట్ వీరాస్వామి, రచ్చ చందు, నల్ల యాదగిరి, ఇటన బోయిన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 'విధి' వెంటాడి.. ఉసురు తీసింది

### గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు సజీవ దహనం

మిర్యాలగూడ, జూన్ 05,( ప్రజాజ్యోతి ):
'విధి' ఆ కుటుంబం పై పగబూనింది..వెంటాడి.. వేటాడింది.. కుటుంబ భారాన్ని మోసే యజమానికి కూడా తల్లి వద్దే ఉంటూ ఇరువురు కూలీ పనులు చేసి పిల్లలను చదివించుకుంటున్నారు. మూడు రోజుల క్రితమే ధనమ్మ ఇళ్లలో పనులు చేసేందుకు పూణే పట్టణానికి



పక్షవాతం సోకి 10 సంవత్సరాలుగా మంచానికే పరిమితమై ఇటీవల మృతి చెందాడు... పెద్ద కుమార్తె భర్త సైతం కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందడంతో... ఇద్దరు పిల్లల్ని వెంటేసుకుని తల్లి పంచన ఆశ్రమం పొందుతుంది... వారి ఆలన చూసేందుకు ఇరువురు కూలీ నాలి చేసుకుని పొట్ట పోసుకుంటున్నారు...
అయినా కనికరించని 'విధి' గ్యాస్ సిలిండర్ రూపంలో అగ్ని ప్రమాదం జరిగి ఘాడ నిద్రలో ఉన్న అమ్మమ్మ,మనవడు మనవరాలు సహా మృత్యువొడిలో శాశ్వత నిద్రలోకి తీసుకు వెళ్లిన హృదయవిదారక సంఘటన శుక్రవారం తెల్లవారుజామున మిర్యాలగూడ పట్టణంలోని కలాల్ వాడలో చోటు చేసుకుంది. గాఢ నిద్రలో ఉన్న కలాలవాడ లోని వనం చంద్రకళ (45) ఇంట్లో అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా భారీ పేలుడుతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో చంద్రకళ తో పాటు, మనవడు నక్క లక్ష్మణ్(16), మనమరాలు నక్క ప్రణతి(14) లు సజీవ దహనం అయ్యారు.పది ఏళ్లుగా మంచాన పడిన చంద్రకళ భర్త సైదులు నెల రోజుల క్రితమే మృతి చెందాడు. తన ఇద్దరు కుమార్తెల్లో పెద్ద కుమార్తె నక్క ధనమ్మ భర్త సైదులు చనిపోవడంతో పిల్లలు లక్ష్మణ్,ప్రణతిలతో కలిసి ధనమ్మ వెళ్ళింది. పిల్లలను అమ్మమ్మ వద్ద విడిచి పెట్టింది. యధావిధిగా గురువారం రాత్రి నిద్రకు ఉపక్రమించారు మృతులు. అర్ధరాత్రి తర్వాత ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇంట్లో మంటలు చెలరేగడంతో, గమనించిన స్థానికులు వారిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ వీలుకాక పోగా గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా భారీ శబ్దం తో పేలడంతో గ్యాస్ దావానలంలా వ్యాపించి మంటల్లో చిక్కుకొని అమ్మమ్మ, మనవడు,మనవరాలు సజీవ దహనం అయ్యారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందజేయడంతో అక్కడికి చేరుకున్న వారు మంటలను అదుపు చేసి, మృతదేహాలను వెలికి తీశారు. సంఘటన స్థలాన్ని డిఎస్పీ కె. రాజశేఖర్ రాజు, వన్ టౌన్ సి ఐ ఎం. నాగభూషణరావు లు పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగభూషణరావు తెలిపారు. కాగా శనివారం చంద్రకళ భర్త సైదులు నెలమాసికం కార్యక్రమం ఉండగా, శుక్రవారమే అనుకోని ప్రమాదం జరిగి ముగ్గురు సజీవ దహనం కావడం పట్ల స్థానికులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. వెంటాడిన విధిని వేనోళ్ల నిందిస్తున్నారు.

## చర్లగౌరారం లో బాలపంచాయతీ అవగాహన కార్యక్రమం..

నల్గొండ జూన్ 5, (ప్రజా జ్యోతి )
నల్గొండ జిల్లా కనగల్ మండలంలోని చర్లగౌరారం గ్రామంలో బాలలలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో బాల పంచాయతీ నూతన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అభిలాష బిష్ట్, చంద్రశేఖర్, శరత్ చంద్ర పవార్ హాజరుకానున్నారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొననున్నారు. గ్రామీణ ప్రాంతాల పిల్లల్లో నాయకత్వ నైపుణ్యాలు, నిర్ణయాధికారం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. బాలల హక్కులు, బాధ్యతలు, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవసరమైన అంశాలపై వారికి అవగాహన కల్పించనున్నారు.
బాల పంచాయతీ ద్వారా పిల్లలకు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే అవకాశం కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, విద్యా ప్రాధాన్యత వంటి అంశాలపై చర్చలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమం బాలలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, భవిష్యత్ లో ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా, నాయకులుగా తీర్చిదిద్దడంలో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నాంపల్లి, జూన్,05(ప్రజా జ్యోతి):
పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తమ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని నాంపల్లి పట్టణ సర్పంచ్ నక్క చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం నాంపల్లి పట్టణ కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్ష



ణకు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలి. మొక్కల సంరక్షణతోనే భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి అందడమే కాకుండా సకాలంలో వర్షం కురుస్తుందన్నారు. ప్లాస్టిక్ ను వాడవద్దని, జలం, వాయువును పరిశుభ్రంగా ఉంచాలి. తడి, పొడి, శానిటరీ ప్రత్యేక వ్యర్థాల కోసం చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకొని పంచాయతీ సిబ్బందికి అందించాలన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పానగంటి నిర్మల వెంకటయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీను, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ టెంరీస్ పాఠశాలవిద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయుల విస్తృత ప్రచారం

### 5,వ తరగతి నుండి ఇంటర్ వరకు అడ్మిషన్లు ప్రారంభం

భువనగిరి,జూన్ 5 (ప్రజాజ్యోతి)
రాష్ట్ర,ప్రభుత్వ మైనార్టీరెసిడెన్షియల్ స్కూల్ (బాయ్స్)స్కూల్ మరియు ఇంటర్,మీడియట్ కాలేజీలో చేర్పించాలని, పట్టణం లోని ఉమ్మడి పహాడినగర్ లో టెంరీస్,అధ్యాపకులతో కలిసి పాఠశాల,కళాశాల బ్రోచర్లను తీసుకొని కళాశాల పాఠశాల ప్రాముఖ్యతను తెలుపుతూ ఇంటింట ప్రచారం నిర్వహించిన కౌన్సిలర్ లాయిఖ్ అహ్మద్,ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు అఫ్షాన్ మహేజాబీన్ మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద మైనారిటీ విద్యార్థులకు హాస్టల్ వసతి తో పాటు అనేక రకాల సౌకర్యాలు కల్పించిందని అన్నారు. టెంరీస్ పాఠశాల లో చదివిన విద్యార్థులు డాక్టర్ లుగా ఇంజనీర్ లుగా మరియు ఇతర రంగాలలో ఉద్యోగాలు చేస్తున్నారని. అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి సంవత్సరానికి లక్ష,రూ ఖర్చుచేస్తుందని అన్నారు.



పాఠశాల మరియు కళాశాల లో 2026 /2027విద్య సంవత్సరానికి, 5వ తరగతి నుండి ఇంటర్ వరకు అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని,విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.అలాగే గత అనేక సంవత్సరాల నుండి 100%ఉత్తీర్ణత సాధించడం జరిగిందని గుర్తు చేసారు.కావున,తమ విద్యార్థులను భువనగిరి పట్టణం లోని స్వర్ణగిరి దేవాలయం వద్ద ఉన్న టెంరీస్ పాఠశాల లో చేర్పించి వారి బంగారు భవిష్యత్ కు బాటలు వేయాలని కోరారు..ఈ కార్యక్రమం లో టెంరీస్ కళాశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

అనంతగిరి జూన్ 05 (ప్రజాజ్యోతి):
అనంతగిరి మండలం కొత్త గోల్ తండా గ్రామ శివారులో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి ఓ మూగజీవి ప్రాణాన్ని బలిగొంది. గ్రామ శివారులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి రక్షణ కవచం ఏర్పాటు చేయకపోవడంతో మేత కోసం వెళ్లిన పాడిగేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే



మృతి చెందింది.సమాచారం అందుకున్న గేదె యజమాని సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతి చెందిన గేదే విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని, తనకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తగిన నష్టపరిహారం అందించాలని కోరారు.అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె లేకపోవడం వల్ల పశువులు, ప్రజలకు ఎప్పుడైనా ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కవచం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.త్వరలో వరి నాట్ల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు పొలాల్లో ఎక్కువగా సంచరించే అవకాశం ఉందని, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గేదె యజమాని, గ్రామస్థులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# పర్యావరణాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుంది

- ఎమ్మెల్యే డాఆర్ భూపతి రెడ్డి
- ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు
- పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాద్యత
- పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపు



**నిజామాబాదు రూరల్ ( ప్రజా జ్యోతి )జూన్ 5**
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ చురుకుగా పాల్గొనాలని శుక్రవారం ఓ పత్రికా ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రకృతిని పరిరక్షించడం ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత అని నొక్కి చెప్పారు. చెట్లు జీవానికి పునాది అని, రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన, సుస్థిరమైన భవిష్యత్తును అందించడానికి పచ్చదనాన్ని పెంచడం అత్యవసరం అని ఆయన అన్నారు. ప్రజలు, యువత, విద్యార్థులు, రైతులు, సామాజిక సంస్థలు మొక్కలు నాటే కార్యక్రమాలలో పాల్గొనాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, నీటిని పొదుపుగా వాడటం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబించాలని ఎమ్మెల్యే డా.ఆర్. భూపతి రెడ్డి కోరారు. పర్యావరణ పరిరక్షణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రకృతి మాత పట్ల తమ నిబద్ధతకు చిహ్నంగా ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కనైనా నాటి పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "ప్రకృతిని రక్షించండి... మన భవిష్యత్తును రక్షించుకోండి" అనేది సమాజానికి మార్గదర్శక సూత్రంగా మారాలని, నేటి సామూహిక ప్రయత్నాలు పచ్చని, ఆరోగ్యకరమైన రేపటిని నిర్ధారిస్తాయని ఆయన నొక్కి వక్కాణించారు.

# ప్రకృతిని రక్షించండి.. మన భవిష్యత్తును రక్షించుకోండి"..

- పర్యావరణాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుంది
- గ్రామ సర్పంచ్ ఎడ్ల ప్రవళిక వినోద్
- ప్రకృతిని రక్షించండి... మన భవిష్యత్తును రక్షించుకోండి"





గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడ్ల ఆనంద్, ధర్మ గౌడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు మేస సాయన్న, యువజన సంఘాలు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశ వర్కర్లు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**డిచ్‌పల్లి ప్రజాజ్యోతి జూన్ 5**
అనేది సమాజానికి మార్గదర్శక సూత్రంగా మారాలని, నేటి సామూహిక ప్రయత్నాలు పచ్చని, ఆరోగ్యకరమైన రేపటిని నిర్ధారిస్తాయని మెంట్ రాజ్ పల్లి గ్రామ సర్పంచ్ ఎడ్ల ప్రవళిక వినోద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. డిచ్పల్లి మండలంలోని మెంట్రాజ్ పల్లి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎడ్ల ప్రవళిక వినోద్ గ్రామసభ నిర్వహించి పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై గ్రామస్తులతో చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత అని నొక్కి చెప్పారు. చెట్లు జీవానికి పునాది అని, రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన, సుస్థిరమైన భవిష్యత్తును అందించడానికి పచ్చదనాన్ని పెంచడం అత్యవసరం అన్నారు. ప్రజలు, యువత, విద్యార్థులు, రైతులు, సామాజిక సంస్థలు మొక్కలు నాటే కార్యక్రమాలలో పాల్గొనాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, నీటిని పొదుపుగా వాడటం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల ప్రవళిక వినోద్ తో పాటు ఉప సర్పంచ్ పోతనోల్ల సురేష్ వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సెక్రటరీ బద్దం అశోక్ గ్రామ యువకులు

## ఫర్టిలైజర్ దుకాణాలపై అధికారులు దాడులు నాణ్యతలేని విత్తనాల పై చర్యలు తప్పవు

**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి) జూన్. 5**
ఇందల్వాయి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ విత్తనాల దుకాణాలపై ఎమ్మార్వో బాలయ్య వ్యవసాయ అధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణంలో విక్రయిస్తున్న విత్తనాలను ఎరువుల నాణ్యత స్టాక్ రిజిస్టర్లను లైసెన్సులను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా ఎమ్మార్వో బాలయ్య మాట్లాడుతూ రైతులను మోసం చేసే విధంగా నకిలీ లేదా నాణ్యతలేని విత్తనాలను విక్రయాలను ఎట్టి పరిస్థితులను సహించబోమన్నారు రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించవలసిన బాధ్యత డీలర్లపైఉందని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారి శ్రీకాంత్





మాట్లాడుతూ నకిలీ విత్తనాలు లేదా నాణ్యతలేని విత్తనాలను విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైన వారి లైసెన్సులను కూడా రద్దు చేస్తామని స్పష్టం చేశారు. రైతులు విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని ఏమైనా అనుమానాస్పద విషయాలు గమనిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సంవత్సరం అందించాలని అధికారులు సూచించారు.

## కమ్మర్‌పల్లిలో సీసీటీవీ కెమెరాలపై అవగాహన సదస్సు

**కమ్మర్‌పల్లి (ప్రజాజ్యోతి) జూన్ 5:**
ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, "మన ఊరు – – మన భద్రత, మన బాధ్యత" కార్యక్రమంలో భాగంగా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, వాటి ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ శ్రీ ఎం.వెంకట్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామ భద్రత, నేరాల నివారణ, అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపులో సీసీటీవీలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. 24 గంటల నిరంతర నిఘా ద్వారా సంఘవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టవచ్చని, ప్రజలు స్వచ్ఛందంగా తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, ప్రధాన కూడళ్లలో కెమెరాలను ఏర్పాటు




చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామ భద్రత కోసం పోలీసు శాఖ చేపడుతున్న ఈ కార్యక్రమానికి తాము పూర్తి సహకారం అందిస్తామని కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామస్థులు స్పష్టం చేశారు.

## విత్తన షాపుల ఆకస్మిక తనిఖీ







**ప్రజాజ్యోతి, ఏర్గట్ల,జూన్5:**
మండలంలోని విత్తన విక్రయ కేంద్రాలను తహసీల్దార్ మల్లయ్య, వ్యవసాయ అధికారి వైష్ణవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు కేంద్రాల్లో విక్రయానికి ఉంచిన విత్తనాల నాణ్యతను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత యాజమాన్యానికి సూచించారు. అలాగే విత్తనాల కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులు తప్పనిసరిగా పక్కాగా నిర్వహించాలని అధికారులిద్దరూ ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే ప్రధానంగా ఉండాలని, నకిలీ లేదా నాసిరకం విత్తనాల విక్రయంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వాలీబాల్ సామగ్రి అందజేత

**ప్రజాజ్యోతి, ఏర్గట్ల, జూన్5:**
మండలశీలోని నాగేంద్ర నగర్ గ్రామ యువకులు వాలీబాల్ ఆడటానికి అవసరమైన సామగ్రిని అందించాలని కోరగా, గుమ్మిర్యాల్ సర్పంచ్ జమున సంజీవ్ యాదవ్, నాగేంద్ర నగర్ ఉప సర్పంచ్ షేక్ జాకీర్ వెంటనే స్పందించి వాలీబాల్ తో పాటు నెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ షేక్ జాకీర్ మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడలు శారీరక మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. అలాగే యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. యువత అభ్యర్థనకు వెంటనే స్పందించి క్రీడా సామగ్రిని అందించిన సర్పంచ్ జమున సంజీవ్ యాదవ్, ఉప సర్పంచ్ షేక్ జాకీర్‌లకు నాగేంద్ర నగర్ యువకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ ఎర్రాజీ హరీష్ పలువురు యువకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.






## రైతులకు నష్టం జరగకుండా తడిసిన వరిని వెంటనే తరలించాలి

– జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి ప్రతినిధి జూన్ 05. (ప్రజాజ్యోతి)**
అకాల వర్షాల కారణంగా ఈ నెల 5వ తేదీ వరకు పూర్తికావలసిన కొనుగోలు ప్రక్రియ 10వ తేదీలోగా కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కామారెడ్డి డివిజన్‌లో గురువారం కురిసిన భారీ వర్షాల కారణంగా సుమారు 800 మెట్రిక్ టన్నుల వరి తడిసిపోవడంతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం అదనపు కలెక్టర్ విక్టర్ తో కలిసి రామేశ్వర్‌పల్లి ప్యాడీ పర్చేజ్ సెంటర్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన కలెక్టర్, రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా తడిసిన వరిని వెంటనే తరలించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ధాన్యం తరలింపులో జాప్యం జరగకుండా తగిన సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేసి తడిసిన వరిని అత్యవసరంగా రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా మేనేజర్ శ్రీకాంత్ , జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డి సి ఓ రామ్మోహన్ రావు, సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సిద్ధిరామేశ్వర రైస్ మిల్లులో ఆరు పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. తడిసిన వరిని వెంటనే అన్‌లోడ్ చేసి స్వీకరించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పూర్తి సహకారం అందించాలని సూచించారు. తమ సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని అన్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన 14 మంది రైస్ మిల్లర్ల పై జిల్లా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియకు సహకరించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని, ప్రస్తుత తేదీ నాటికి జిల్లాలో మొత్తం 4,19,000 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారి ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి సకాలంలో తరలించేందుకు అన్ని చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## నందిపేట్ పిఎస్‌కు నూతన ఎస్‌హెచ్‌వోగా వినయ్

**(నందిపేట్ ప్రజాజ్యోతి)**
నందిపేట్ పోలీస్ స్టేషన్ కు నూతన ఎస్‌హెచ్‌వోగా ఎస్ఐ కె. వినయ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని కోరారు. కాగా, ఇంతకుముందు నందిపేట్ ఎస్ఐగా విధులు నిర్వహించిన శ్యామ్‌రాజ్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో వినయ్ బాధ్యతలు చేపట్టారు.



## స్వచ్ఛ గ్రామం సురక్షిత జల వాయువుపై ప్రత్యేక గ్రామ సభ

**నాగిరెడ్డిపేట్,జూన్5(ప్రజాజ్యోతి);**
అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్ గ్రామపంచాయతీలో గ్రామా సర్పంచ్ భూమా యాదాగౌడ్ అద్యక్షతన స్వచ్ఛ గ్రామం సురక్షిత జల వాయువుపై ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ,పరిశుభ్రత, ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ,. ప్లాస్టిక్ వినియోగం, నీటి వనరుల శుభ్రత, ఇతర ముఖ్యమైన అంశాల గురించిగ్రామా ప్రజలకు అవగాహనా కల్పించారు. గ్రామాభివృద్ధి, ప్రజా భాగస్వామ్యం మరియు సమస్యల పరిష్కారమే ఈ గ్రామసభ ముఖ్య ఉద్దేశ్యం అని సర్పంచ్ అన్నారు. అనంతరం పర్యావరణ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాద గౌడ్ ఉప సర్పంచ్ అభిషేక్, ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ దివిటీ కిష్టయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయితీ కార్యదర్శి కార్తీక్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## పాత్రికేయ మిత్రులను ఘనంగా సన్మానించిన బీర్కూర్ లయన్స్ క్లబ్



**బాన్సువాడ ఆర్ సి, జూన్ 5 (ప్రజా జ్యోతి)**
సమాజ సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్న పాత్రికేయ మిత్రులను బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీతాల రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బీర్కూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన పాత్రికేయులకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సితలే రమేష్ మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు చేరవేస్తూ సామాజిక చైతన్యం కల్పిస్తున్న పాత్రికేయుల సేవలు అభినందనీయమని అన్నారు. సమాజాభివృద్ధిలో మీడియా పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పాత్రికేయుల సహకారం వల్లే క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మరింత మందికి చేరుతున్నాయని, వారికి కృతజ్ఞతగా ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజాహిత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు మేకల విఠల్, ఎం.ఏ. రషీద్, కిషోర్ ప్రభుదాస్, వీరయ్య సేట్ తదితరులు పాల్గొన్నారు. పాత్రికేయ మిత్రులు కూడా లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

## నూతన పంచాయితీ కార్యదర్శికి సన్మానం

**నాగిరెడ్డిపేట్,జూన్5 (ప్రజాజ్యోతి);**



మండలంలోని నాగిరెడ్డిపేట్ గ్రామానికి నూతన పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన విజయ్ కుమార్ ను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఇటీవల జరిగిన పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో ఇప్పటివరకు పంచాయతీ కార్యదర్శిగా కొనసాగిన కార్తీక్ తాండూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో జుక్కల్ నుండి బదిలిపై విచ్చేసిన విజయ్ కుమార్ బాధ్యతలను స్వీకరించారు. ఈ నేపథ్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శిని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజలు తమ వంతుగా సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బాయమొల్ల సాయగౌడ్, గ్రామ అధ్యక్షులు బోయిని హన్మండ్లు,కుమ్మరి విఠల్,బుర్రి సాయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భావితరాల మనుగడకు హరిత రక్షణ!

● అర్బన్ పార్కులో వైభవంగా వన మహోత్సవం ● మొక్కలు నాటిన ఆర్‌డీఓ, కమిషనర్, తహసీల్దార్



నర్సాపూర్ (ప్రజాజ్యోతి) పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక కర్తవ్యమని, భావితరాలకు పచ్చని ప్రకృతిని పదిలపర్చడమే నిజమైన సంపదని అధికారులు పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యచరణలో భాగంగా.. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నర్సాపూర్ ఫారెస్ట్ అర్బన్ పార్కులో అధికారులు సంయుక్త సమక్షంలో వన మహోత్సవం నిర్వహించారు. అటవీ క్షేత్రాధికారి దివ్య నేతృత్వంలో జరిగిన ఈ హరిత యజ్ఞానికి ఆర్‌డీఓ రామకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. వాతావరణ సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి, అది వృక్షంగా మారే వరకు బాధ్యతగా సంరక్షించాలని అధికారులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి సిద్ధిరాం సింగ్, సెక్షన్ అధికారులు సాయిరాం, రాజమణి, శ్రీధర్, బీట్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థులకు
# వరంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల

● ఉచిత సౌకర్యాలతో ఉన్నత విద్యకు స్వాగతం
● డిజిటల్ విద్యతో విజయానికి బాటలు వేస్తున్న ప్రభుత్వ కళాశాల






వెల్దుర్తి (ప్రజాజ్యోతి) జూన్ 05: వెల్దుర్తి శ్రీమతి రాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ మరియు సీఈసీ గ్రూపులలో తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియంలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. అడ్మిషన్ల ప్రచారంలో భాగంగా కళాశాల అధ్యాపక బృందం వెల్దుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రభుత్వ కళాశాల ప్రత్యేకతలను వివరిస్తూ చైతన్యం కల్పిస్తోంది. ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, ఉదయం టిఫిన్ -- సాయంత్రం స్నాక్స్, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం అన్ని సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి మీ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని కళాశాల యాజమాన్యం విద్యార్థులకు పిలుపునిచ్చింది. అదేవిధంగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జూన్ 1వ తేదీ నుంచే తరగతులు ప్రారంభమైనందున ప్రతి విద్యార్థి తప్పనిసరిగా కళాశాలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ బి. శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్రీనివాస్, అధ్యాపక బృందం మరియు నాన్-టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# బడి గంట మోగక ముందే.. బ్యాగుల సందడి!

● నర్సాపూర్ మార్కెట్‌లో విద్యా సామాగ్రి కొనుగోళ్లు
● రక రకాల మోడళ్లు.. ఒక్కో బ్యాగు 400 పైమాటే..!



నర్సాపూర్ (ప్రజాజ్యోతి) వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కానుండడంతో నర్సాపూర్ పట్టణ కేంద్రంలో విద్యా సామాగ్రి కొనుగోళ్ల సందడి ఊపందుకుంది. కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మార్కెట్లకు క్యూ కడుతున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, కూరగాయల సంత, రద్దీ ప్రాంతాల్లో తాత్కాలిక బ్యాగుల దుకాణాలు వెలిశాయి. చిన్నారులను ఆకట్టుకునే కార్టూన్ బొమ్మల బ్యాగుల నుంచి కళాశాల విద్యార్థుల వరకు రక రకాల మోడళ్లు మార్కెట్లోకి వచ్చాయి. నాణ్యతను బట్టి ఒక్కో బ్యాగు ధర 400ల నుంచి 450 వరకు పలుకుతోందని వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఒకవైపు పుస్తకాలు, ఫీజుల భారం వెంటాడుతున్నా.. తమ పిల్లల ముఖంలో సంతోషం కోసం తల్లిదండ్రులు బడ్జెట్‌ను సర్దుబాటు చేసుకుంటూ కొనుగోళ్లు చేస్తుండడం మార్కెట్‌లో కనిపిస్తోంది. రాబోయే రెండు మూడు రోజుల్లో ఈ సందడి మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

# వనరుల సంరక్షణతోనే అవనికి ఆయుష్షు!

● బీవీఆర్‌ఐటీలో పర్యావరణ దినోత్సవం



నర్సాపూర్ (ప్రజాజ్యోతి) వాతావరణ మార్పుల ముప్పు నుంచి భూగోళాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ ప్రకృతి వనరులను సంరక్షించాలని బిట్స్ పిలానీ ప్రొఫెసర్ డా. అభ్రదీప్ మజుందర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నర్సాపూర్‌లోని బీవీఆర్‌ఐటీ కళాశాల సివిల్ విభాగం ఆధ్వర్యంలో 'సేవ్ క్లైమేట్-సేవ్ ఎర్త్' అంశంపై సదస్సు నిర్వహించారు. భవిష్యత్ తరాల మనుగడకు సుస్థిరమైన వాతావరణమే నిజమైన ఆస్తి అని, కాలుష్య నివారణలో యువతరం భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లోని 'విష్ణు పెరిమీటర్ ట్రైల్' నడక మార్గాన్ని ఆయన పరిశీలించి, కళాశాల హరిత చొరవను కొనియాడారు. కార్యక్రమంలో డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే, సివిల్ విభాగాధిపతి డా. ఎస్. కృష్ణారావు పాల్గొన్నారు.

# కన్నవారి స్మరణ.. అంబలి వితరణ..

● పదేళ్లుగా కొనసాగుతున్న నాగరాజు గౌడ్ సేవ ● నాడు చలివేంద్రం.. నేడు అంబలి కేంద్రం..!

నర్సాపూర్ జూన్ 5 (ప్రజాజ్యోతి) కన్నవారిపై ఉన్న మమకారాన్ని సమాజ సేవగా మలచి, నర్సాపూర్ పట్టణ ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు స్థానిక బీఆర్ఎస్ నాయకుడు దుర్గప్ప గారి నాగరాజు గౌడ్. తన తల్లిదండ్రులు దుర్గప్ప గారి కమలమ్మ-వెంకటస్వామి గౌడ్‌ల స్మృత్యర్థం ఆయన 2016 నుంచి ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, దశాబ్ద కాలంగా దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. దీనికి ముందే పట్టణంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చిన చరిత్ర ఆయనకుంది. ప్రతి ఏటా వేసవి కాలంలో భాగంగా.. పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ముఖద్వారం ఎదుట ప్రతి శుక్రవారం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఎండవేడికి అలసిపోయే ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీరుస్తూ ప్రతి శుక్రవారం సుమారు 2500 మందికి పైగా చల్లని అంబలిని పంపిణీ చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా, స్థిరమైన సంకల్పంతో పదేళ్లుగా ఒక చల్లని ఆసరాగా నిలుస్తున్న నాగరాజు గౌడ్ ఉదారత, కన్నవారిని గౌరవించుకునే తీరు అందరికీ ఆదర్శనీయమని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



# మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారం

● ప్రతిఒక్కరూ మొక్కను నాటినీ అమ్మను గౌరవించాలి
● మెదక్ అర్బన్ ఫారెస్ట్ పార్కుల గొప్పతనాన్ని పర్యాటకులకు ప్రాచుర్యం కల్పించాలి
● మెదక్ ఫారెస్ట్ ను టూరిస్ట్ హబ్ గా రూపొందించాలి
● జిల్లావ్యాప్తంగా గ్రీన్ యాక్షన్ ప్లాన్ తయారీకి పటిష్ట ప్రణాళిక
● ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు కలెక్టర్
● 200 చెట్లతో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం ప్రారంభోత్సవం
● జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




మెదక్ (ప్రజాజ్యోతి) 05 జూన్ : 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్ జిల్లా రామాయం పేట మండలం అక్కన్నపేట గ్రామం వన్ యోజన అటవీ పార్కు నందు నిర్వహించిన కార్యక్రమా నికి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్). హైదరాబాదు నుండి రత్నాకర్, డి ఎఫ్ ఓ జోజి, డిఆర్ డిఓ పి డి శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈఈ వేణు, సంబంధిత ఎఫ్ ఆర్ ఓ ,రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, యాదగిరి, శర్మ రాజశేఖర్ సర్పంచ్ యాదగిరి, ఉపసర్పంచ్ ప్రసాద్ లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి, పర్యావ రణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. అనంతరం అటవీ శాఖ ఏర్పాటు పర్యావరణ పరిరక్షణపై జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడు తూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అటవీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రకారం జిల్లాలో ఈ కార్యక్రమాలు విజయవం తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏక్ పెడ్ మా కే నామ్' ప్రతి భారతీయుడి ని తమ తల్లి మరియు భూమాత గౌరవార్థం ఒక మొక్కను నాటమని ప్రోత్సహించే ఒక హృదయపూర్వక దేశవ్యాప్త పర్యావరణ ఉద్యమం. అన్నారు. ఇది మాతృత్వంలోని పోషణ స్ఫూర్తిని, ప్రకృతి యొక్క జీవనాధార శక్తితో అనుసంధానించి, మరింత పచ్చని గ్రహాన్ని పెంపొందుతుంది అన్నారు. మొక్కలు నాటుతున్నప్పుడు, మీ అమ్మ ప్రేమను, త్యాగాలను గౌరవించడా నికి ఒక్క క్షణం కేటాయిం చాలని హితవు పలికారు. మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారాల అనే నినాదంతో ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటినీ సంరక్షించి భవిష్యత్తులో వృక్షాలుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. అటవీ సంపద సంరక్షణ, జీవ వైవిధ్యం పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణకు సంబంధించి అంశాలపై విద్యార్థి దశ నుండే తెలుసుకోవాలన్నారు. జిల్లాలో 24% అటవీ సంపద ఉందని ,జిల్లాలో నర్సాపూర్, వడియారం, పరికిబండ, మనోరాబాద్ అర్బన్ ఫారెస్ట్ పార్కులను హైలెట్ చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఫారెస్ట్‌కు పిల్లలకు ప్రత్యేక టూర్ అరేంజ్ చేసి వారందరికీ జిల్లాలో అటవీ సంపద ఫారెస్ట్ పార్కులు మొక్కల వల్ల భావితరాలకు ఉపయోగం సంబంధిత విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో అటవీ సంపదను పరిరక్షించడంలో అటవీశాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. భవిష్యత్ తరాలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేలా అడవులను సంరక్షించేందుకు ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నారని వివరించారు. జిల్లాస్థాయి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా అర్బన్ ఫారెస్ట్ పార్కుల పర్యాటకులకు ప్రాచుర్యం పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రత్నాక జోహారీ మాట్లాడుతూ.. జిల్లాలో వరల్డ్ ఎన్రోల్మెంట్ కార్యక్రమంలో పాల్గొనడం




చాలా ఆనందంగా ఉందని మానవాళి మనుగడకు చెట్లే ప్రతిరూపంగా ఉంటాయన్నారు విశాఖపట్నంలో సునామీ ఏర్పడినప్పుడు చెట్లు ఉన్న ప్రాంతాలలో దాని యొక్క తాకిడి చాలా తక్కువ మొత్తంలో ఉన్నది అంటే చెట్ల యొక్క ప్రాముఖ్యత తెలుసుకోవాలన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ అటవీ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు జిల్లా అధికారులు ,ప్రజా ప్రతినిధులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆరుతడి పంటలతో అధిక లాభం

● వరాహా కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు
● రైతులు అధిక లాభాలు పొందేందుకు అవగాహన సదస్సు
● మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని




దుబ్బాక ప్రతినిధి జూన్ 05 (ప్రజా జ్యోతి) రైతులు ఆధునిక పద్ధతిలో పంటలు పండించి అధిక లాభాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం రోజున దుబ్బాక మండలం చికోడ్ గ్రామంలోని రైతు వేదికలో వరహ కంపెనీ ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ప్రియదర్శిని మాట్లాడుతూ.... ఆరుతడి పంటలతో రైతులు మంచి వ్యవసాయాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. ఆరుతడి ద్వారా నీటిని పొదుపు చేసుకోవచ్చని, సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని, పంట దిగుబడి మెరుగుదల వంటి ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. అంతేకాకుండా వరి సాగులో నీటి నిర్వహణ సుస్థిర వ్యవసాయ పద్ధతులు ఆధునిక సాంకేతికతల ద్వారా రైతులు అధిక లాభాలు పొందే మార్గాలపై చర్చించారు. రైతులకు సందేహాలకు సమాధానాలు అందించే ఆరతడి విధానాన్ని వారి వారి పొలాల్లో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమిరే నరేష్, ఎంపీ ఓ , ఏ ఈ ఓ, మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

● పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత ● ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

దౌల్తాబాద్, జూన్ 05: (ప్రజా జ్యోతి) ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన సర్పంచ్ పోతరాజు ప్రకాష్ , పోసాని యాదగిరి శుక్రవారం మండల పరిధిలోని లింగరాజు పల్లి, అప్పాయిపల్లి గ్రామం తో పాటు వివిధ గ్రామాలలో ఉపాధి హామీ కూలీలతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు చెట్ల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ కూలీలకు మోతుకు ఆకులతో ఇస్తారులను కుట్టే విధానాన్ని అవగాహన కల్పించారు. గ్రామాలలో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధ రామంగా తీర్చిదిద్దాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు. ప్రతి ఇంట్లో ప్లాస్టిక్ ను నిషేధించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీమాన్ రెడ్డి, హంసకేతన్ , మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్ ,ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి నర్సింలు, మహేష్, కుమార్, సురేష్, అనిల్, కుమార్ తోపాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.






## మొక్కలు
# నాటడం కాదు వాటిని సంరక్షించాలి

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు
- ప్రతి ఒక్కరు మొక్కలు నాటండి



అక్బరుపేట్/భూంపల్లి, జూన్ 06 ( ప్రజా జ్యోతి) పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించినప్పుడే భవిష్యత్తు భావితరాలకు ఉపయోగపడుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతురి వెంకట్ స్వామి గౌడ్ అన్నరు. శుక్రవారం రోజున అక్బరుపేట్/భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ నీల ప్రభాకర్, ఉప సర్పంచ్ నవీన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరు కనీసం ఒక్క మొక్కను నాటి దాని సంరక్షించాలని తెలిపారు. పెరుగుతున్న కాలుష్యం వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు చెట్ల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి అమరేష్ ఫీల్డ్ అసిస్టెంట్ గోపరి స్వామి, అంగన్వాడీ టీచర్ వెంకటలక్ష్మి, ఆశ వర్కర్ కవిత, గ్రామస్తులు గోపరి అర్జున్, వెలుపల రాజయ్య, పెద్దోళ్ల అంజయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ
# పరిరక్షణకు కృషి చేయాలి

నంగునూరు, జూన్ 5(ప్రజా జ్యోతి) పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ నాయకులు పిలుపు ఇచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన ఏక్ పేడ్ మాకే నామ్(అమ్మ పేరుతో ఒక మొక్క) పిలుపు మేరకు మండల కేంద్రమైన నంగునూరులో వారు శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి కాపాడడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపు మేరకు మొక్కలను నాటినట్లు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు చౌడుచర్ల వెంకట్రామిరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతి రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు జీడిపల్లి రజనీకర్ రెడ్డి, గంధం పరమేశ్వర రెడ్డి, కోల సతీశ్ గౌడ్ తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి మానవాళి మనుగడ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.



## ఆపన్న హస్తం కోసం ఎదురు చూపులు,

ఆర్థిక సాయం కోసం అర్జిస్తున్న చేతులు,

ఎండపల్లి జూన్ 5 ప్రజా జ్యోతి

నిరుపేద కుటుంబం ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని గుల్లకోట గ్రామానికి చెందిన మద్రిపల్లి నాగలక్ష్మి రెండు రోజుల క్రితం పాము కాటుకు గురై ,ప్రస్తుతం జగిత్యాల లోని ఓ ఆసుపత్రిలో చికిత్స



పొందుతుంది,మెరుగైన చికిత్స కోసం స్తోమత లేకపోయినా అప్పు సప్పు చేసి ప్రత్యేక వైద్య నిపుణులను సంప్రదించారు.మెరుగైన చికిత్స ఖరీదైన వైద్యం అందించాలని వైద్యులు సూచించారు, రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబ పరిస్థితి,వారిది అభయమిచ్చేందుకు ఆపన్న హస్తం కోసం ఆ పేద కుటుంబం ఎదురుచూస్తుంది, సాయం చేసేవారు ఈ క్రింది ఫోన్ నెంబర్ 9949825340 ఫోన్ పే అలాగే గూగుల్ పే చేసి,తమకు తోచిన విధంగా సహకరించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## రైస్ మిల్లుల్లో ధాన్యం అన్లోడింగ్ వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ బి.ఎస్. లత

భీమారం జూన్ 5 ప్రజా జ్యోతి

భీమారం మండలంలోని గంగా భవాని ఇండస్ట్రీస్, రంగాపూర్ గ్రామంలోని చైతన్య ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మిల్లర్లతో మాట్లాడుతూ ధాన్యంతో వచ్చిన లారీలను 24 గంటల్లోగా అన్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీల కొరత



లేకుండా అవసరమైన సంఖ్యలో కార్మికులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్లు సజావుగా, వేగవంతంగా జరిగేలా అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. అన్లోడింగ్ ప్రక్రియలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తనిఖీల్లో తహసీల్దార్ వరందన్ , డీటీ స్వప్న , సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఇస్రో విజ్ఞాన యాత్ర దాతలకు ఘన సన్మానం

మేడిపల్లి జూన్ 5 ప్రజా జ్యోతి

మేడిపల్లి మండల ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎస్ఎస్సీ మార్చి–2026 పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కేరళలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌కు విమానంలో తీసుకెళ్లిన దాతలను జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము ఘనంగా సన్మానించారు. గౌరవ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచన మేరకు, మన ఊరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏనుగు రమేష్ రెడ్డి, చేపూరి నాగరాజు, బొంగొని రాజా గౌడ్, షేరు నగేష్, తేలు నరేష్, వెల్మ నవీన్ రెడ్డి ఆర్థిక సహకారంతో ఈ విజ్ఞాన యాత్ర నిర్వహించారు. యాత్రలో భాగంగా విద్యార్థులు ఇస్రో నిర్వహించిన RH–200 సౌండింగ్ రాకెట్ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించడంతో పాటు స్పేస్ సైన్స్ మ్యూజియంను సందర్శించి భారత అంతరిక్ష రంగ అభివృద్ధిపై అవగాహన పొందారు. హైదరాబాద్ నుంచి తిరువనంత



పురం వరకు చేసిన తొలి విమాన ప్రయాణం జీవితాంతం గుర్తుండిపోతుందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డీఈఓ కె. రాము మాట్లాడుతూ, తెలంగాణలో విద్యార్థులకు విమాన ప్రయాణంతో కూడిన ఇలాంటి విజ్ఞాన యాత్రలు నిర్వహించడం నూతన ఒరవడికి నాంది అని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆకుల లక్ష్మీనర్సయ్య , కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ హమీద్, మేడిపల్లి సర్పంచ్ మకిలి దాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జన్మది నం సందర్భంగా పండ్ల పంపిణీ

చొప్పదండి,జూన్ 5(ప్రజాజ్యోతి):

శాసనసభ్యులు డా. మేడిపల్లి సత్యం జన్మదినాన్ని పురస్కరించుకొని చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. శుక్రవారం ఆసుపత్రిని సందర్శించిన చైర్మన్ కొత్తూరి మహేష్,నాయకులు వార్డుల్లో చికిత్స



పొందుతున్న రోగులను పరామర్శించి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.రోగుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కొత్తూరి మహేష్ మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధి కోసం 24/7 కష్టపడుతున్న ఎమ్మెల్యే సత్యమన్న ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఆయన జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్, డైరెక్టర్లు వీర్ల స్వామి,పెరుమండ్ల రవి గౌడ్, 5వ వార్డు కౌన్సిలర్ వడ్లూరి అనూష–శ్యాంసుందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిలుముల స్వప్న, భూపాలపట్నం మాజీ సర్పంచ్ సుధాకర్ గౌడ్, సోషల్ మీడియా ఇన్చార్జ్ కళ్యాణపు శ్రీనివాస్, కోటి, అఖిల్, శ్రావణ్, కార్తీక్, సాయి, స్థానిక నాయకులు, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరిచాలి.

జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా

కరీంనగర్ బ్యూరో, జూన్ 5( ప్రజాజ్యోతి ) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ఓటర్



జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదామును శుక్రవారం జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎలక్షన్ సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా మాట్లాడుతూ ఈవియం గోదాం వద్ద అప్రమత్తంగా ఉండాలనీ సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోడౌన్ లను క్షుణ్ణంగా తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోడౌన్ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చించారు.ఈవియం గదులను వి వి ప్యాట్ స్టోరేజీ విధానాన్ని పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ అదరపు కలెక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏన్, వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్ ,బిఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ , సిపియం పార్టీ ప్రతినిధి డి, నరేష్ పటేల్, ఏఐఎంఐఎం పార్టీ ప్రతినిధులు సయ్యద్ ఇబ్రహీం, మాజిద్ హుస్సేన్, బిజెపి పార్టీ ప్రతినిధి బి సాయికృష్ణ ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## డిఫెన్స్ రంగంలో సత్తా చాటిన తేజస్ అకాడమీ విద్యార్థులు

తేజస్ అకాడమీ నుంచి 160 మందికి డిఫెన్స్ ఉద్యోగాలు

కొత్తపల్లి,జూన్ 5 (ప్రజాజ్యోతి )

తేజస్ అకాడమీ విద్యార్థులు డిఫెన్స్ రంగంలో మరోసారి సత్తా చాటారు. అకాడమీ నుంచి మొత్తం 160 మంది విద్యార్థులు భారత సాయుధ దళాల్లో ఉద్యోగాలు సాధించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని "తేజస్ శౌర్య–2026" కార్యక్రమాన్ని నిర్వహించి ఎంపికైన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. అకాడమీ వివరాల ప్రకారం 156 మంది విద్యార్థులు ఇండియన్ ఆర్మీలో, ముగ్గురు విద్యార్థులు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీరులుగా ఎంపికయ్యారు. ఆర్మీ జీడీ విభాగంలో 131 మంది, ట్రేడ్స్‌మెన్ విభాగంలో 12 మంది, టెక్నికల్ విభాగంలో 13 మంది, క్లర్క్ విభాగంలో ఒకరు ఉద్యోగాలు సాధించారు. ఎయిర్‌ఫోర్స్ నాన్–టెక్నికల్ విభాగంలో ముగ్గురు ఎంపికయ్యారు.ఈ విద్యార్థులు జూన్ 2025లో హనుమకొండలో నిర్వహించిన ఆర్మీ ఓపెన్ ర్యాలీలో పాల్గొని ప్రతిభ కనబరిచారని, మే 31, 2026న విడుదలైన మెరిట్ జాబితాలో అగ్నివీరులుగా ఎంపికయ్యారని తేజస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్ రావు తెలిపారు. అలాగే జూన్ 1న విడుదలైన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ మెరిట్ జాబితాలో ముగ్గురు విద్యార్థులు అగ్నివీరులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన "తేజస్ శౌర్య–2026" కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన




విద్యార్థులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. జూన్ 8 నుంచి ఆయా శిక్షణ కేంద్రాల్లో వారు రిపోర్ట్ చేయనున్నట్లు సతీష్ రావు పేర్కొన్నారు.డిఫెన్స్ ఉద్యోగాలతో పాటు విద్యా రంగంలోనూ తేజస్ అకాడమీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులు సాధించారని అకాడమీ తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో అత్యుత్తమ ఫలితాలు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.ఇప్పటి వరకు వివిధ నోటిఫికేషన్ల ద్వారా 2 వేల మందికి పైగా విద్యార్థులను ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దిన ఘనత తేజస్ అకాడమీకి దక్కిందని, భవిష్యత్తులో కూడా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి కొనసాగిస్తామని సతీష్ రావు తెలిపారు.

## ఉత్సాహంగా గౌరెల్లి లక్ష్మణరావు స్మారక క్రికెట్ ప్రీమియర్ లీగ్,

విజేతలకు మెమొంటో అందించిన తహశీల్దార్ అనిల్ కుమార్,

ఎండపల్లి, జూన్ 5 ,ప్రజా జ్యోతి

కీర్తి శేషులు గౌరెల్లి లక్ష్మణరావు స్మారకార్థం ,జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేట



లో క్రికెట్ ప్రీమియర్ లీగ్,వారి బంధువుల,సమక్షంలో గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్లో 10 జట్లు పాల్గొనడం జరిగింది. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో రమేష్ టీమ్ అద్భుతమైన విజయంతో విజేతగా నిలిచి మొదటి బహుమతిని 5000 రూపాయలు అందుకోగా,
రెండవ బహుమతి ప్రదీప్ టీమ్ 3000 రూపాయలు అందుకున్నారు,ఈ మ్యాచ్ కి ముఖ్య అతిథులుగా ఎండపల్లి మండల తహశీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్ హాజరై క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు గ్రామస్థాయి నుంచి క్రీడలలో రాణిస్తూ మండల &జిల్లా రాష్ట్రస్థాయి అలాగే దేశ స్థాయికి తయారు కావాలని ఆకాంక్షిస్తూ, అలాగే గ్రామ సర్పంచ్ జీ రెడ్డి మహేందర్ రెడ్డి గురించి మాట్లాడుతూ మీ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ యువతకు మంచి ఆదర్శంగా నిలుస్తూ మిమ్మల్ని క్రీడలలో ప్రోత్సహిస్తూ అన్ని రంగాల్లో ముందుకు తీసుకపోతున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, యువత చదువుతోపాటు క్రీడలలో రాణించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రావు, గ్రామస్తులు క్రీడా అభిమానులు క్రీడాకారులు, పాల్గొన్నారు

## జ్ఞాన సరస్వతి సభ్యులకు ధృవీకరణ పత్రాలు అందజేసిన చైర్పర్సన్

చొప్పదండి, జూన్ 5 (ప్రజాజ్యోతి):

కరీంనగర్ లోని కళాభారతిలో ఇటీవల నిర్వహించబడిన సకల కళల సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన మహిళ భజన కార్యక్రమంలో పాల్గొన్న చొప్పదండి జ్ఞాన సరస్వతి భజన బృందం సభ్యులకు మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జ్ఞాన సరస్వతి భజన బృందం సభ్యులు చైర్మన్ సరిత ను ఘనంగా సన్మానించారు. ఆలయ పూజారి నవీన్ భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులను ఆశీర్వదిస్తూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన సరస్వతి దేవాలయ, విద్యాలయ కమిటీ సభ్యులు లక్ష్మారెడ్డి, ఆనందరెడ్డి, జ్ఞాన సరస్వతి ప్రధాన సభ్యురాలు దండే రమాదేవి రవీందర్, సభ్యులు గుర్రం జయప్రద, గుర్రం విజయలక్ష్మి ,మంద విజయ, భీమనాథుని విజయలక్ష్మి , పెంచికల రమా, చీకట్ల లచ్చయ్య, కొమ్ముల సుజాత, గుర్రం పద్మ, గుర్రం అరుణ, మల్లేశ్వరి ,తిరుమల ,మాధవి, నీరజ, గంగ, సరళ, రమా , శ్రీలక్ష్మి ,రాజమణి కవిత, విజయలక్ష్మి , పద్మ, శ్రీలత, జనని దేవి తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరించిన

గంభీరావుపేట జూన్5 ( ప్రజా జ్యోతి);

గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం రోజున తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా గంభీరావుపేట టిఆర్ఎస్ మండల ఇంచార్జ్ కూర సురేష్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ జండా ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర అబ్జ అబ్జర్వ్ డ్ ధరణి రాణి. జిల్లా ఇన్చార్జిలు వరద సతీష్. సుధాకర్ శర్మ, సుమలత శర్మ. మజీద్. సంపత్ పాల్గొని మండలంలో మహనీయుల అంబేద్కర్ గాంధీ.
విగ్రహాలకు తెలంగాణ తల్లి పూలమాలలు వేసి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. మండల ఇన్చార్జి కూర సురేష్ తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ , తెలంగాణ రక్షణ సేన ( టిఆర్ఎస్) పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జెండా పండుగ వైభవంగా కొనసాగుతోంది. మే 20 నుంచి జూన్ 20 వరకు నెల రోజుల పాటు ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించుకుంటూ తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన పార్టీ




ఏర్పాటైందని అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి ఉద్యమకారులు, అమరుల కుటుంబాలకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, గుర్తింపు కార్డులు ప్రకటించాలని కోరారు. అలా జరగకపోతే తెలంగాణ ఉద్యమం తరహాలో ప్రభుత్వంపై ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అమరుల స్థూపం ఆవిష్కరణపై హెచ్చరిక తెలంగాణ అమరుల స్థూపం 20 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ అధికారికంగా ఆవిష్కరించకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకురాలు శివమాల. ఎర్ర నరసయ్య. పాపారావు.
పల్లె బాలయ్య. వివిధ మండలాల టిఆర్ఎస్ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి..పర్యావర ణాన్ని పరిరక్షించాలి

బీజేపీ మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామిగౌడ్

ఇల్లంతకుంట జూన్ 5(ప్రజజ్యోతి)

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని రహింకన్పేట్ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బి జే పి మనకొండూర్ జాయింట్ కన్వీనర్ బతిని స్వామి గౌడ్ రహీంఖాన్ పేట 292,293 బూతులలో గ్రామ ప్రజలతో కలిసి మొక్కలు నాటారు ఈ సందర్భంగా బత్తిని స్వామిగౌడ్ మాట్లాడుతూ





పర్యావరణ పరిరక్షణకు మన వంతు కృషి చేస్తూ, భావి తరాలకు స్వచ్ఛమైన హరిత భవిష్యత్తును అందిద్దామన్నారు. ప్రాణుల మనుగడకు ప్రకృతే ఆధారమని, అడవుల నరికివేతను అడ్డుకుందాం.. పచ్చదనం పెంచి పర్యావరణాన్ని రక్షించుకుందామని పేర్కొన్నారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమని అన్నారు. ప్రజలందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బత్తిని సాయి గౌడు, బొల్లం రాజు, జెట్టి హరికృష్ణ, జెట్టి రాజు, జెట్టి రామస్వామి, చక్రాల దుర్గయ్య, తాడూరి కనకయ్య, తొత్తుల ఎల్లయ్య, కంఠం అజయ్ తదితరులు పాల్గొన్నారు

## ర్యాంకు సాధించిన విద్యార్థికి ఎమ్మెల్యే సన్మానం

చొప్పదండి, జూన్ 5 (ప్రజాజ్యోతి):

విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జెఈఈ అడ్వాన్స్డ్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి బొల్లం సాయిదీక్షిత్ ను చొప్పదండి శాసనసభ్యులు మేడిపెల్లి సత్యం ఘనంగా సన్మానించారు. చొప్పదండి మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ కుమారుడు సాయిదీక్షిత్ జేఈఈ అడ్వాన్స్డ్ లో సి ఆర్ ఎల్ 2255, ఓ బి సి 419 ర్యాంకులు సాధించాడు. అంతేకాకుండా జేఈఈ



మెయిన్స్ లో 6785 ర్యాంకు, ఓ బి సి 1518 ర్యాంకు, ఎప్సెట్ లో స్టేట్ 195వ ర్యాంకు సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచాడు. ఈ విషయం తెలుసుకున్న విద్య ఫౌండేషన్ చైర్మన్ పచ్చునూరి తిరుపతి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం ను ఆహ్వానించగా, ఆయన స్వయంగా విద్యార్థి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల సమక్షంలో సాయిదీక్షిత్ ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ, సాయిదీక్షిత్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీర్వదించారు. కష్టపడి చదివితే గ్రామీణ విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో రాణించగలరని నిరూపించాడని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణహరి, మాజీ ఎంపీటీసీ ఎలిగేటి తిరుపతి, ఫౌండేషన్ సభ్యులు పైడా మహేష్, మామిడి రాజేష్ పవార్, వల్లాల జగన్, సామల వెంకటేష్, బొద్దుల వెంకటేశం, దాసరి మునిందర్, మహేశుని మల్లేశం, సిరిపురం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మోదుగాకులతో విస్తరి తయారీ

ధర్మారం,జూన్5(ప్రజాజ్యోతి న్యూస్):

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మారం మండలంలోని రామయ్యపల్లి గ్రామంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ మూల మంగ మల్లేశం గౌడ్, గ్రామ కార్యదర్శి శైలజ రాణి ఉపాధి హామీ కూలీలతో కలిసి మోదుగాకులతో విస్తరులను తయారు చేశారు.ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ హితమైన వస్తువులను ఉపయోగించడం ద్వారా ప్రకృతిని సంరక్షించవచ్చని అన్నారు. మోదుగాకులతో తయారు చేసే విస్తరులు పర్యావరణానికి మేలు చేయడంతో పాటు గ్రామీణులకు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తాయని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్రకృతి వనరులను సంరక్షించడం వంటి చర్యలను చేపట్టాలని సూచించారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామస్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు దోహదపడిందన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉయ్యాల శ్రీనివాస్, అమరగాని లక్ష్మీ–ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట మహేందర్, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఖమ్మం జిల్లా కోర్టుల ప్రాంగణంలో వనమహోత్సవం

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఖమ్మం జిల్లా కోర్టుల ప్రాంగణంలో హరితోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, జిల్లా అటవీ శాఖ అధికారులు కలిసి మొక్కలు నాటారు. ఉదయం 10 గంటలకు జిల్లా అదనపు న్యాయమూర్తులు, జామ, మామిడిఉసిరి, మర్రి, రావి, కానుగ ఇతర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, పాల్గొన్నారు. ఖమ్మం బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అదేవిదంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం పరిధి రేంజర్ మరియు సిబ్బంది మొక్కలు, నాటి,ట్రీ గార్డులు, ఎరువులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తులు మాట్లాడుతూ, కాలుష్యం కోరలు చాస్తున్న నేటి కాలంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత అవసరం. మొక్కలు నాటుదాం – భవిష్యత్‌ను కాపాడుదాం' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. మొక్క నాటడమే కాదు, అది వృక్షంగా ఎదిగే వరకు సంరక్షించే బాధ్యత తీసుకోవాలి. న్యాయ స్థానాలు న్యాయంతో పాటు పచ్చదనానికి కూడా నెలవు కావాలి. అని ఆకాంక్షించారు. అటవీ శాఖ అధికారి మాట్లాడుతూ, తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈనెల 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పర్యావరణ దినోత్సవం వారోత్సవాలు జరగనున్నాయని తెలిపారు, ఈ ఏడాది జిల్లాలో 50 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. జిల్లా కోర్టు వంటి ప్రభుత్వ కార్యాలయాలు ముందుకు రావడం శుభపరిణామం. నాటిన మొక్కలకు మూడు సంవత్సరాల పాటు అటవీ శాఖ సహకారం ఉంటుందని తెలిపారు.






## దేవస్థాన భూమిపై రోడ్డు నిర్మాణం వివాదం

● విచారణకు గ్రామ యువత డిమాండ్

ముదిగొండ జూన్ 05(ప్రజా జ్యోతి )

ముదిగొండ మండల పరిదిలోని ముత్తారం గ్రామ శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి చెందిన భూమిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంపై గ్రామంలో వివాదం నెలకొంది. రోడ్డు నిర్మాణం పేరుతో దేవాదాయ శాఖకు చెందిన భూమి ఆక్రమణకు గురవుతోందని గ్రామ యువత ఆందోళన వ్యక్తం చేస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, రోడ్డు విస్తరణలో భాగంగా ఇరువైపులా సమానంగా భూమి తీసుకోవాల్సి ఉండగా, దేవస్థాన భూమి వైపునే ఎక్కువ భాగం వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజా ఆస్తిగా భావించే దేవాలయ భూమి క్రమంగా తగ్గిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దేవాలయ భూములు భక్తుల విశ్వాసానికి ప్రతీకగా, భవిష్యత్ తరాల ఆస్తిగా పరిగణించబడతాయని, వాటి పరిరక్షణలో అధికారులు ప్రత్యేక బాధ్యత వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు. రోడ్డు నిర్మాణం అవసరమైనప్పటికీ, దేవస్థాన భూములకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని సూచిస్తున్నారు. ఈ వ్యవహారంపై దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వాస్తవాలను వెలికితీయాలని, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామ యువత డిమాండ్ చేసింది. దేవస్థాన ఆస్తుల పరిరక్షణకు పారదర్శక చర్యలు అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## సీపీఐ (ఎం) సీనియర్ నాయకులు కొడెం లక్ష్మినర్సు మృతి

● పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పిస్తున్న నాయకులు

కారేపల్లి, జూన్ 5, ప్రజా జ్యోతి :

సింగరేణి మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన సిపిఐ(ఎం)పార్టీ సీనియర్ నాయకులు కొడెం లక్ష్మీ నర్సు(60) శుక్రవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యం తో బాధపడుతున్న లక్ష్మినర్సు పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. అమరజీవి ఏలూరు లక్ష్మీనారాయణ నాయకత్వంలో లక్ష్మినర్సు తన అన్న కొడెం అనంత రాములు తో కలిసి పూర్వ ఇల్లందు డివిజన్ లో సీపీఐ(ఎం)నిర్వహించే ప్రజా పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. మధిర మాజీ శాసనసభ్యులు అమరజీవి బోడెపుడి వెంకటేశ్వరరావు కారు డ్రైవర్ గా కామ్రేడ్ కొడెం లక్ష్మీనర్సు సుదీర్ఘకాలం పనిచేశారు. లక్ష్మీనర్సు భార్య పద్మ గతంలో మృతి చెందింది. లక్ష్మీనర్సు మృతదేహంపై నాయకులు సిపిఐ(ఎం)పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులైన కుమార్తెలు స్వాతి, రాణి లకు సానుభూతిని తెలియజేశారు. నివాళ్లు అర్పించిన వారిలో సీపీఐ(ఎం)మండల కమిటీ సభ్యులు కేసగాని ఉపేందర్, సీనియర్ నాయకులు కరపటి వీరస్వామి, కేసగాని రామ్మూర్తి, ఈసం వెంకటేశ్వర్లు, కరపటి లక్ష్మయ్య, గోవర్ధనగిరి దశరథ్, జాగటి నాగేశ్వరరావు, కొడెం బోస్, బాయమ్మ, నీలిమ, గోపి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## పల్లె దవాఖాన అభివృద్ధి కోసమే పూడిక మట్టి తోలాను: ఏడుకొండలు

వైరా జూన్ 5 ప్రజాజ్యోతి

వైరా మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డుకు చెందిన కౌన్సిలర్ బత్తుల సుమతి భర్త ఏడుకొండలు తాను గురువారం కాలువ పూడిక తీసిన బురద మట్టిని పల్లె దవఖానా లోతట్టు ఆవరణంలో మేరువ నిమిత్తం రెండు ట్రక్కులు పోశానన్నారు. మున్సిపల్ చెత్త పోసి, డంపింగ్ యార్డ్ చేస్తున్నట్టు,16వ వార్డు కౌన్సిలర్ బలరామయ్య అపోహపడ్డారని శుక్రవారం ప్రజా జ్యోతికి చెప్పారు. వైరా మున్సిపాలిటీలో డంపింగ్ యార్డ్ స్థల సేకరణ అధికారులకు సవాల్గా మారింది. అనువైన చోట ప్రభుత్వ స్థలం లేకపోవడం వల్ల, నిత్యం సేకరిస్తున్న చెత్తని ఎక్కడ డంపు చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. మున్సిపాలిటీ ఏర్పడ్డ దగ్గర నుండి, వైరా రిజర్వాయర్ ప్రాజెక్టు దిగు భాగాన కొంతకాలం చెత్త డంపింగ్ చేశారు. అక్కడ రైతుల నుండి వ్యతిరేకత రావడంతో, పినపాక బ్రిడ్జి, వాగు పక్కన కొంతకాలం డంపింగ్ చేశారు. మిగిలిపోయిన చెత్తను తగలబెట్టినప్పుడు వచ్చే కాలుష్య పొగ తాకిడికి ప్రజల ఆరోగ్యంతో పాటు, తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణికులు మరణించిన సంఘటనలు కూడా ఉన్నాయి. అక్కడి నుంచి మరోచోటికి మార్చాలని నూతన పాలకవర్గం ఆలోచన చేసినప్పటికీ, స్థల సేకరణ మాత్రం దొరకడం లేదు. శాంతినగర్ పక్కన ఉన్నటువంటి ప్రభుత్వ గుట్టని చదును చేసి అక్కడ డంపింగ్ చేయాలని పాలకవర్గం ఆలోచన చేశారు. ఆచరణలోకి రాలేదు. వార్డులలో సేకరించిన చెత్త ఎక్కడబడితే అక్కడ వేయటంతో మున్సిపాలిటీ అస్తవ్యస్తంగా ఉంది ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి పెట్టి మునిసిపాలిటీ సేకరించిన వ్యర్థాలను ఆధునిక యంత్రాల ద్వారా సేంద్రియ ఎరువుగా మార్చుటానికి ఆలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు.



# రైతులు పండించిన చివరి గింజ కొనుగోలు చేసిన ప్రజా ప్రభుత్వం

● మండలంలో సుమారు 6.50 లక్షల క్వింటాల మొక్కజొన్న కొనుగోలు

చింతకాని జూన్ 05 ప్రజాజ్యోతి

మొక్కజొన్న రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతుల పక్షపాతిగా నిరూపించుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపి ఈరోజు చింతకాని మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపి యాదవ్ మాట్లాడుతూ.. చింతకాని మండలంలో సుమారు ఆరున్నర లక్షల క్వింటాల మొక్కజొన్న కొనుగోలు విజయవంతంగా నిర్వహించినట్టుగా తెలియజేశారు. మండలంలోని నాగులవంచ సొసైటీ 2.50 లక్షల క్వింటాలు చింతకాని సొసైటీ 4 లక్షల క్వింటాలు..సుమారుగా రైతులకు150 కోట్ల రూపాయలు లబ్ధి చేరినట్టుగా తెలియజేశారు. మొక్కజొన్న రైతుల సంక్షేమం విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రైతాంగానికి అండగా నిలిచే చారిత్రాత్మక చర్యలుగా నిలిచాయిఅని దేశంలోని అనేక రాష్ట్రాల్లో రైతులు తమ పంటకు సరైన ధర కోసం ఆందోళనలు చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం రైతు పండించిన ప్రతి గింజకు విలువ దక్కేలా కొనుగోలు ప్రజా ప్రభుత్వం చేసింది అని పేర్కొన్నారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం తోనే రైతులకు అండగా నిలుస్తుందని అన్నారు. ఈ సంవత్సరం మొక్కజొన్న దిగుబడి అధికంగా వచ్చిన నేపథ్యంలో మార్కెట్‌లో ధరలు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉన్నప్పటికీ, రైతులు నష్టపోకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ముందస్తు చర్యలు చేపట్టింది. రైతు తన పంటను దళారుల చేతిలో కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించే అవకాశం కల్పించడం వల్ల గిట్టుబాటు ధరకు భరోసా లభిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం రైతును అన్నదాతగా గౌరవిస్తోంది. అందుకే రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలతో పాటు పంట కొనుగోళ్లలో కూడా రైతుకు పూర్తి రక్షణ కల్పిస్తోంది. మొక్కజొన్న రైతులు ఎదుర్కొనే మార్కెట్ అనిశ్చితులను తగ్గించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం రైతు సంక్షేమంపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. నేడు మొక్కజొన్న రైతుకు ప్రభుత్వం ఒక భరోసా. పంట పండించే ముందు పెట్టుబడి కోసం రైతుబంధు, పంట సమయంలో విద్యుత్, నీటి సౌకర్యాలు, పంట అనంతరం కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర --- ఈ సమగ్ర రైతు సంక్షేమ దృక్పథమే తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపింది. అని కన్నెబోయిన గోపి యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో.. జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ కార్యదర్శి కొప్పుల గోవిందరావు, అబ్దుల్ నబీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నన్నాక శ్రీనివాసరావు, చింతకాని సొసైటీ అధ్యక్షులు శేఖర్ రెడ్డి మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బందెల నాగార్జున, ఎస్కె కాసిం, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కంచమూర్తి రామకృష్ణ, మహిళ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి, మధిర నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అనిల్ కుమార్ వేర్పుల, మాజీ ఎంపీటీసీ బొర్రా ప్రసాద్,మండల సేవా దళ్ అధ్యక్షులు పరస గాని సతీష్, సర్పంచులు లోయ ఉపేందర్, ఆవుల నాగేశ్వరరావు,ఉప వంగూరి రమేష్, అంబటి శరత్, ఎస్సీ సెల్ అధ్యక్షులు వనం చెన్నప్ప, గ్రామ శాఖ అధ్యక్షులు కంచం కోటేశ్వరావు, పగడాల రాధాకృష్ణ నాయుడు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బొల్లికొండ రామారావు, మరీదు రామకృష్ణ, తాళ్లూరి రమేష్, కర్రి వెంకటేశ్వర్లు, అంజి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రి ఆంధ్రకా.. తెలంగాణకా..

● ఆంధ్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చి అక్కడి ప్రజలను ఉద్ధరించండి ● టిఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇంచార్జ్

వైరా జూన్ 4 ప్రజా జ్యోతి

ఆంధ్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలంగాణ రాజకీయాల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) వైరా నియోజకవర్గ ఇన్చార్జి గౌరవరపు జగదీష్ అన్నారు. ఆంధ్రాలో ప్రజలకు అనేక అలివిగాని వాగ్దానాలు చేసి మూడు పార్టీలు కలిసి అధికారంలోకి వచ్చిన కూటమిలో ఉపముఖ్యమంత్రిగా కొనసాగుతున్న పవన్ కళ్యాణ్, అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో అక్కడి ప్రజలకు ఏవిధమైన మేలు చేశారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఆంధ్రాలో రాజధాని కట్టుకోవడం చేతకాని పాలకులకు, తెలంగాణ అస్తిత్వాన్ని ప్రశ్నిస్తూ, ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడి రాజకీయంగా లబ్ధి పొందాలనుకుంటే అది జరగదు అన్నారు. ఏళ్ల తరబడి తెలంగాణ ప్రజలు ఆంధ్ర పాలకుల దొంద విధానాల వల్ల గోసపడ్డారని తెలంగాణ విముక్తి కోసం దశాబ్దాల పాటు అనేక ఉద్యమాలు జరిగాయని అన్నారు. ఒక్క చుక్క నెత్తురు చిందకుండ రాష్ట్రాన్ని సాధించిన ఘనత తెలంగాణ ప్రజలదని ఆయన పేర్కొన్నారు,1200 మంది తెలంగాణ విద్యార్థుల బలిదానాల త్యాగాలతో నిర్మితమైన తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ చిచ్చు పెట్టడానికి ఆంధ్ర పాలకులు కుయుక్తులు పన్నుతున్నారని తెలియజేశారు. పవన్ కళ్యాణ్ పార్టీతో పాటు, ఆంధ్ర పార్టీలకు తెలంగాణలో స్థానం ఉండదని ఆయన తేల్చి చెప్పారు. రాబోవు ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన పార్టీ అధికారంలోకి వస్తుందని జోష్యం చెప్పారు. టిఆర్ఎస్ చీఫ్ కవితమ్మ చెప్పినట్టు తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆంధ్ర పెత్తందార్ల ఆటలు తెలంగాణలో సాగనీయమని తేల్చిచెప్పారు.



## మొక్కలు నాటుదాం.. భవిష్యత్ తరాలకు పచ్చదనాన్ని అందిద్దాం

● ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి

చింతకాని జూన్05(ప్రజా జ్యోతి )

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని,ఐసిడిఎస్ చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చింతకాని 2,3 అంగన్వాడి కేంద్రంలో టీచర్ భద్ర, బేబీ కుమారి ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ పచ్చదనం,పరిశుభ్రత ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుంది అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించి మొక్కలు నాటడం, పెంచడం ద్వారా అహ్లాదకరమైన, ప్రశాంత వాతావరణ తో పాటు స్వచ్ఛమైన గాలిని పిలుస్తామన్నారు. మనం నిత్యజీవితంలో వినియోగించు వస్తువులు పదార్థాల వలన కాలుష్యం విడుదలై వాతావరణం కలుషితమవుతుంది కాబట్టి,మనమందరం మొక్కలు నాటడం,చెట్లను పెంచడం ద్వారా భావితరాల వారిని కాలుష్యం బారిన పడకుండా చూడొచ్చు అన్నారు. మొక్కలు నాటి సంరక్షించినప్పుడే బాధ్యత పూర్తవుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు క్రమశిక్షణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ తెలియజేసే విధంగా విద్యాబోధన నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం భూమిని పునరుద్ధరించడానికి,ఎడారీకరణను నివారించడానికి, కరువును ఎదుర్కోవడానికి,మన చుట్టూ ఉన్న వాతావరణం మెరుగుపరచడానికి మా పూర్తి మద్దతును అందజేస్తామని తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు.





## మొక్కలు నాటుదాం.. భవిష్యత్ తరాలకు పచ్చదనాన్ని అందిద్దాం..

● ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి

చింతకాని జూన్05(ప్రజా జ్యోతి )

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని,ఐసిడిఎస్ చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చింతకాని 2,3 అంగన్వాడి కేంద్రంలో టీచర్ భద్ర, బేబీ కుమారి ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ పచ్చదనం,పరిశుభ్రత ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుంది అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించి మొక్కలు నాటడం, పెంచడం ద్వారా అహ్లాదకరమైన, ప్రశాంత వాతావరణ తో పాటు స్వచ్ఛమైన గాలిని పిలుస్తామన్నారు. మనం నిత్యజీవితంలో వినియోగించు వస్తువులు పదార్థాల వలన కాలుష్యం విడుదలై వాతావరణం కలుషితమవుతుంది కాబట్టి,మనమందరం మొక్కలు నాటడం,చెట్లను పెంచడం ద్వారా భావితరాల వారిని కాలుష్యం బారిన పడకుండా చూడొచ్చు అన్నారు. మొక్కలు నాటి సంరక్షించినప్పుడే బాధ్యత పూర్తవుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు క్రమశిక్షణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ తెలియజేసే విధంగా విద్యాబోధన నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం భూమిని పునరుద్ధరించడానికి,ఎడారీకరణను నివారించడానికి, కరువును ఎదుర్కోవడానికి,మన చుట్టూ ఉన్న వాతావరణం మెరుగుపరచడానికి మా పూర్తి మద్దతును అందజేస్తామని తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు.

## మున్సిపల్ కమిషనర్‌గా సందీప్

ఇల్లందు, జూన్ 5, ప్రజాజ్యోతి:

ఇల్లందు మున్సిపల్ కమిషనర్‌గా ఎస్ సందీప్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్ 1 ఆఫీసర్ గా ఎంపికై, ట్రైనింగ్ పూర్తి చేసుకొని మొదటి పోస్టింగ్ లో ఇల్లందు మున్సిపల్ కమిషనర్ గా రావడం జరిగిందని తెలిపారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సలహాలు, సూచనలు, మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఇల్లందు మున్సిపాలిటీని అన్ని రంగాలలో అగ్రభాగాన నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా వచ్చి తన దృష్టికి తీసుకురావాలని కోరారు.



## సర్టిఫికెట్ల కోసం మధ్యవర్తులను ఆశ్రయించ వద్దు

● సర్టిఫికెట్ల సమస్య ఇక్క ఏదైనా సమస్య ఉంటే నేరుగా నన్ను సంప్రదించండి.

● తహసీల్దార్ సూర్యప్రకాశ్



అశ్వాపురం, జూన్ 5, ప్రజా జ్యోతి పత్రిక

అశ్వాపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ప్రజలకు అందించే రెవెన్యూ సేవలపై పలు కీలక విషయాలను వెల్లడించారు. సర్టిఫికెట్ల కోసం ప్రజలు కార్యాలయం చుట్టూ పదేపదే తిరగాల్సిన అవసరం లేదని, ఏవైనా సమస్యలు లేదా సందేహాలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్న ఆయన, దరఖాస్తుల పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నామని తెలిపారు. మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ద్వారా అందిస్తున్న సేవలు, దరఖాస్తుల పరిష్కార విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లీలావతి, యూడిసి, జీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ఇల్లందు, జూన్ 5, ప్రజాజ్యోతి:

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ ఫిల్టర్ బెడ్‌లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ భవిష్యత్ భావి తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్ సందీప్, ఏఈ నవీన్, ఫిల్టర్ బెడ్ ఇంచార్జ్ ఫయాజ్, మున్సిపల్ సిబ్బంది తదితర పాల్గొన్నారు.




## ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు

**మొదటిపేజీ తరువాయి..**

అన్నామలై తెలిపారు. భారతీయుడిగా, తమిళుడిగా గర్విస్తున్నానని, తన ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. తమిళనాడు అభివృద్ధే తన ప్రథమ ప్రాధాన్యమన్నారు. అన్నామలై శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మార్పు కోసమే బీజేపీలో చేరానన్నారు. రాజీనామా ఆమోదించిన బీజేపీ హైకమాండ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని అన్నారు. 'తమిళనాడులో బీజేపీ ఒంటిరిగా పోటీ చేయాలని ఆశించా. 18 నెలలుగా బీజేపీతో విభేదాలు ఉన్నాయి. బీజేపీకి నేను భారంగా ఉండాలనుకోవడం



లేదు. అందుకే బీజేపీకి రాజీనామా చేశా. 2025 డిసెంబర్ నెలలోనే అధిష్ఠానానికి రాజీనామా గురించి చెప్పా. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీలో ఉన్నా'అని అన్నారు. 'ఈ సమయంలో తమిళనాడుకు కొత్త పార్టీ అవసరమా అని అడిగితే.. కచ్చితంగా అవసరమే అని అన్నామలై అన్నారు. ఓ షాపునకు వెళ్లి టూత్‌పేస్టో.. బియ్యమో.. కందిపప్పో కొంటున్నపుడు పది షాపులు తిరుగుతాము. రేటు, నాణ్యత చెక్ చేసి కొంటాం. ఎందుకంటే అవి మన శరీరంలోకి పోయేవి. ఇప్పుడు ఎన్ని పార్టీలు ఉన్నా కూడా పార్టీ నాయకుడు ఎలాంటి వాడో ప్రజలు చూస్తారు. పక్కంటి వాళ్లను చూసినట్లే ప్రజలు మమ్మల్ని చూడబోతున్నారు. దూరం నుంచి ప్రజలకు అభివాదం చేసే రాజకీయాలకు మేము దూరం. కల్ట్ పాలిటిక్స్ నుంచి బయటకు రావాలి. రాజకీయాలను మారుస్తాం అంటున్నారు.. మళ్లీ అదే కల్ట్ పాలిటిక్స్ చేస్తున్నారు. కామన్ మ్యాన్ పాలిటిక్స్ ముందుకు తీసుకురావాలనుకుంటున్నా. కేవలం ముఖ్యమంత్రి కారణంగా మార్పు సాధ్యం కాదు. సర్పంచ్ దగ్గరి నుంచి ముఖ్యమంత్రి వరకు అందరూ నిబద్ధత కలిగిన వాళ్లు ఉంటేనే మార్పు సాధ్యం అవుతుందని అన్నామలై అన్నారు. ఈసందర్భంగా ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రస్తావన తెచ్చారు. తనతో చేతులు కలపమని గతంలో సూపర్‌స్టార్ అడిగారన్నారు. 2024లో తాను భాజపాలో చేరడానికి ఒకరోజు ముందు రజనీకాంత్ నాకు ఫోన్ చేశారు. ఆయన నేతృత్వం వహిస్తున్న రాజకీయ ఉద్యమంలోకి రావాలని ఆహ్వానించారు. కానీ, నేను అప్పటికే భాజపా సీనియర్ నేత బీఎల్ సంతోష్‌కు మాటిచ్చా. అందుకే రజనీ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించా. నేను రాజకీయాల్లోకి రావడానికి కారణం బీఎల్ సంతోష్ ఇచ్చిన హామీనే. నా రాజకీయ ప్రవేశంపై ఉన్న ఊహాగానాలకు ముగింపు పలికేందుకు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాను. అయితే తమిళనాడు విషయంలో నా అభిప్రాయాలు.. భాజపా నాయకత్వం అభిప్రాయాలతో సరిపోలలేదు. ఈ విభేదాలను పరిష్కరించు కునేందుకు పార్టీ అగ్రనాయకత్వంతో 18 నెలలుగా ఎన్నో చర్చలు జరిపాను. ఇంక భాజపాకు భారంగా ఉండకూడదని అనుకున్నాను' అని అన్నామలై వివరించారు. ఇకపై స్వతంత్ర రాజకీయ మార్గంలో ముందుకువెళ్తానని, తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త బాటలు వేసేందుకు పోరాడతానని తెలిపారు.

గత ఏడాది డిసెంబర్‌లోనే నా రాజీనామా గురించి చెప్పాను. అయితే పార్టీ పెద్దలు నన్ను ఆపారు. ఎన్నికల బాధ్యతలు నిర్వహించమని సూచించారు. ఇప్పుడు నా రాజకీయాలు సామాన్యుడి లక్ష్యంగా ఉంటాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సొంతంగా పోటీ చేస్తాను. అప్పటివరకు అందరినీ ఏకతాటిపైకి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నిస్తాను. అలాగే అన్నామలై మక్కల్ ఇయక్కమ్ పేరిట రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. దానికి భారీ స్పందన వస్తోందని చెప్పారు. ఇదిలావుంటే అన్నామలై వెళ్లిపోవడం వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని భాజపా తమిళనాడు చీఫ్ నైనార్ నాగేంద్రన్ వెల్లడించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

## అసమ్మతికి కళ్లెం వేసే యత్నం

### లోక్‌సభకు పోటీచేసే యోచనలో మమత

కోల్‌కతా,జూన్5(ప్రజాజ్యోతి):

తృణమూల్ కాంగ్రెస్‌కు లోక్‌సభలోనూ అసమ్మతి పెరుగుతున్న సంకేతాలు వెలువడుతుండటంపై ఆ పార్టీ సుప్రీం మమతా బెనర్జీ లోక్‌సభకు పోటీ చేసే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది. ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో టీఎంసీ ఓటమి పాలై అధికారం కోల్పోయింది. 80 సీట్లు గెలుచుకుని ప్రతిపక్షానికే పరిమితమైంది. ఈ నేపథ్యంలో లోక్‌సభకు పోటీ చేసే ఆలోచనలో మమతాబెనర్జీ ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. బహరాంపుర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మమతా బెనర్జీ పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నియోజకవర్గానికి ప్రస్తుతం టీఎంసీ ఎంపీ యూసఫ్ పఠాన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారురు. ఆయనను రాజీనామా చేసి మమత పోటీకి మార్గం సుగమం చేయాలని కోరనున్నట్టు తెలుస్తోంది. 2011 ప్రపంచ కప్ విన్నింగ్ స్క్వాడ్‌లో ఒకరైన భారత మాజీ క్రికెటర్ పఠాన్ 2024 పార్లమెంటు ఎన్నికల్లో బహరాంపుర్ నుంచి గెలిచారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత అధీర్ రంజన్ చౌదరిపై 85,000 ఓట్ల ఆధిక్యంతో పఠాన్ గెలుపొందారు. మమతా బెనర్జీ గతంలోనూ లోక్‌సభ సభ్యురాలిగా ఉన్నారు. కోల్‌కతా సౌత్ నుంచి ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. అయితే తొలి ఎన్నిక మాత్రం జాదవ్‌పూర్ నియోజకవర్గం నుంచి సీపీఐ అగ్రనేత సోమనాథ్ ఛటర్జీపై పోటీ చేసి గెలుపొందారు. 2011లో బెంగాల్ అసెంబ్లీకి వెళ్లేంతవరకూ లోక్‌సభ సభ్యురాలిగానే ఆమె ఉన్నారు. రైల్వేమంత్రిగానూ పనిచేశారు. ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘనవిజయం సాధించింది. కాగా, ఇటీవల కాలంలో పార్టీ నాయకత్వం పనితీరుపై లోక్‌సభ టీఎంసీ సీనియర్ ఎంపీల్లో అసమ్మతి తలెత్తెది. కొందరు పార్టీ వీడే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. మమతకు సన్నిహితురాలిగా పేరున్న పార్టీ సీనియర్ ఎంపీ కాకోలి ఘోష్ దస్తిదార్ బహిరంగంగానే ఇటీవల తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. బరాసత్ నుంచి నాలుగు సార్లు ఎంపీగా ఉన్న ఆమె లోక్‌సభలో తనపై అనుచితంగా మాట్లాడుతున్నారంటూ టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు ఫిర్యాదు చేశారు. పార్టీ పనితీరును ప్రశ్నించిన సీనియర్ ఎంపీల్లో సుఖేందు శేఖర్ రాయ్, శాంతను సేన్ సైతం ఉన్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో తిరుగుబాటును టీఎంసీ ఎదుర్కొంటోంది. టీఎంసీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా పార్టీకి చెందిన 57 మంది ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. స్పీకర్ రతీంద్ర బోస్ కూడా ఈ నియామకాన్ని గుర్తించారు. ఈ క్రమంలో ముందుగా లోక్‌సభలో అసమ్మతికి క్లళెం వేసేందుకు సభలో అడుగుపెట్టాలనే ఆలోచనలో మమతా బెనర్జీ ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.





# బీఆర్ఎస్‌వి అన్నీ అబద్ధాలే..



**మొదటిపేజీ తరువాయి..**

అడగండని కేసీఆర్‌కు సీఎం రేవంత్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతామన్నారు. మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. రాసి పెట్టుకో కేసీఆర్.. పాలమూరులో మీ జెండా ఎగరనివ్వమని హెచ్చరించారు. పాలమూరు ప్రాజెక్టుకు డిసెంబర్‌లోగా 90 టీఎంసీలు నీటిని సాధిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. నీటి సమస్యలపై పక్క రాష్ట్రాలతో చర్చలు వద్దా? అని కేసీఆర్ తీరును ఎండగట్టారు. తాను చర్చలు చేస్తానంటే బురద జల్లుతున్నారని మండిపడ్డారు. ఏపీతో చర్చలు జరుపుతామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణలో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణెళి తన లక్ష్యమని సీఎం రేవంత్ ప్రకటించారు. వలసలు, ఆత్మహత్యల కష్టనష్టాలు మనకు తెలుసునన్నారు. కేసీఆర్ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన కేసీఆర్‌ను గెలిపించారని వివరించారు. ఎంపీగా గెలిచిన కేసీఆర్ కనీసం ప్రజలను కలవడానికి కూడా రాలేదన్నారు. కష్టకాలంలో ఆదుకున్న పాలమూరును కేసీఆర్ పట్టించుకోలేదని చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు కేసీఆర్ ఎన్నో హామీలు ఇచ్చారు కానీ కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. పాలమూరు నుంచి పారిపోయిన కేసీఆర్ ద్రోహి అవుతారా? లేక నేనా? అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదంటూ కేసీఆర్‌పై మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు పాదయాత్ర చేస్తామంటున్నారని సీఎం రేవంత్ వ్యంగ్యంగా అన్నారు. కాశీ వరకు పొర్లు దండాలు చేసినా మీ పాపాలను ఎవరూ మరిచిపోరని ఆ పార్టీ నేతలకు స్పష్టం చేశారు. కేసీఆర్ ఎప్పుడైనా రైతుల కష్టాల గురించి ఆరా తీశారా? అని ప్రశ్నించారు. మేక వన్నె పులిలాంటి కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ నమ్మరని పేర్కొన్నారు. కేసీఆర్ తర్వాత ఆయన కొడుకు, మనవడు రాజ్యాలు ఏలుతారా? అని నిలదీశారు.

నాడు మిడ్జిల్ నుంచి తాను జెడ్పిటిసిగా గెలిచానని గుర్తు చేశారు. 2006లో మీరు నాటిన మొక్కే ఇప్పుడు వృక్షమై మీ ముందుందని ప్రజలను ఉద్దేశించి సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. నాడు మీరు గెలిపించిన ఈ జెడ్పిటిసి ఇప్పుడు రాష్ట్రానికి సీఎం అయ్యారని వివరించారు. కేసీఆర్ కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే మనవాళ్లే ఉండాలన్నారు. ఆత్మగౌరవంతో బతకాలంటే ఇందిరమ్మ ఇల్లు ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదన్నారు. బీఆర్ఎస్ నేతలవి నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. దళితులకు 3 ఎకరాలు ఇస్తామని చెప్పి దగా చేశారన్నారు. కేజీ టు పీజీ విద్య హామీ ఎక్కడికి పోయిందని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇకపై పాలమూరు గడ్డపై బీఆర్ఎస్ గుర్తు మాయమని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. మీ పాలమూరు బిడ్డగా రెండురోజులుగా జిల్లా రైతులకోసం సాగునీరు ప్రాజెక్టులను పరిశీలించానన్నారు. వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు మనకు తెలుసని అన్నారు.

పాలమూరులో ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరు లేకపోయినా ఇక్కడికి రాజకీయంగా వలసవచ్చిన కేసీఆర్ ను ఇక్కడి ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. కెసీఆర్ మేకవన్నె పులి అని గుర్తించక ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణకు రెండుసార్లు ముఖ్యమంత్రిని చేస్తే.. పదేళ్లలో పాలమూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. పాలమూరులో గెలిపిస్తే పారిపోయి గజ్వేల్ లో పోటీ చేసిన కెసీఆర్ పాలమూరు ద్రోహినా? నేను పాలమూరు ద్రోహినా అంటూ నిలదీసారు. పాలమూరు జిల్లాలో 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో పని చేస్తున్నాం.మీ పాలమూరు బిడ్డగా జిల్లాలో ప్రాజెక్టుల కోసం ఈ 30 నెలల్లో 8 వేల కోట్లు ఖర్చు చేశా.జైళ్లు కట్టాలని వాళ్లు అనుకుంటే స్కూళ్లు కట్టాలని మనం అనుకున్నాం.ఏం చదవాలన్నా పాలమూరు జిల్లాకు వచ్చేలా కొడంగల్ లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నాం. చదువొక్కటే మీ జీవితాల్లో వెలుగు నింపుతుంది.. పిల్లల్ని చదివించండి? చదువుకుంటేనే బతుకులు బాగుపడతాయి జిల్లాల్లో వలసలు ఆగాలన్నా, రైతులు సంతోషంగా ఉండాలన్నా పాలమూరు జిల్లా ప్రాజెక్టులు పూర్తి కావాలన్నారు. పాలమూరు ప్రజలు మట్టి తీసుడే కాదు? మట్టితో కప్పడం కూడా తెలుసన్నారు. రేవంత్ రెడ్డి ఏం చేసిండని కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారు. 15 లక్షల రేషన్ కార్డులు అందించాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాం. పది వేల కోట్లు మహిళలకి ఉచిత బస్సు ప్రయాణానికిఖర్చు చేశాం ఇలా మేం చేసింది చెప్పాలంటే రాస్తే రామాయణం.. చెబితే భారతం . మీ పదేళ్ల పాలనపై, మా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దాం.. కెసీఆర్ అసెంబ్లీకి రా అంటూ సవాల్ చేశారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరు చేసే బాధ్యత నాదని అన్నారు. 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని, 2029 లో కాంగ్రెస్ ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి,స్థానిక ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ కోట్లు దోపిడీ

**మొదటిపేజీ తరువాయి..**

నీళ్లివ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం.. రెండోరోజు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం అని అన్నారు. . మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు.

అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని మండిసపడ్డారు. కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా



జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారని అన్నారు. మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం.

ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నాం. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారని రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేస్తాం. కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నాం. పనులకు అడ్డుపడకుండా ఉండాలని బీఆర్ఎస్ నేతలను కోరుతున్నా. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటివారు. బీఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది.. భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టయినా మొదలుపెట్టి పూర్తి చేసిందా చెప్పాలి. ప్రాణహిత-చేవెళ్ల పేరు, ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసు. ఆయన సొంతంగా మొదలుపెట్టిన ప్రాజెక్టు ఒక్కటీ రాష్ట్రంలో లేదు. కాళేశ్వరం కూలిన తర్వాత చుక్క నీళు తీసుకోకుండా ఎక్కువ వరి ఉత్పత్తి చేశాంఅని రేవంత్ అన్నారు. జిల్లాకు కారు పార్టీ అధినేత తీరని అన్యాయం చేశారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. నీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని.. వారి పాలనలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారని రేవంత్ పేర్కొన్నారు. ఒక్క కాళేశ్వరంపైనే రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. అది పూర్తి చేసి ఉంటే 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం ఉండేదన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని.. వేల కోట్లు పెట్టి కేవలం పంపులు, లిఫ్టులు మాత్రమే నిర్మించారని సీఎం రేవంత్ మండిపడ్డారు.

నీటి పారుదల శాఖలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఇప్పటికీ నగదు చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత 30 నెలల్లో రూ.52 వేల కోట్లకు పైగా అసలు, వడ్డీ చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు.తమ ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రతి 6 నెలలకోసారి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ పర్యటనలో సిఎం వెంట మంత్రలుఉ ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తదితరులు ఉన్నారు.

## కోహెడ పండ్ల మార్కెట్‌కు నేడు సీఎం శంకుస్థాపన

**శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల**

**దేశానికే ఆదర్శంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు**

**రైతులకు, వ్యాపారులకు, వినియోగదారులకు సమగ్ర సౌకర్యాలు**

**వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

హైదరాబాద్,జూన్5(ప్రజాజ్యోతి):

తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ రంగ చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలవనున్న కోహెడా అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణానికి శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో శంకుస్థాపన ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రూ.3,367.35



కోట్ల వ్యయంతో 239 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న కోహెడా అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకోనున్నదని తెలిపారు. రైతు సంక్షేమం, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, ఆధునిక మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రైతు పండించిన ప్రతి ఉత్పత్తికి మార్కెట్ హామీ కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తుల విలువను పెంచడం, రైతుల ఆదాయాన్ని వృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు.వ్యవసాయ మార్కెటింగ్ రంగాన్ని మరింత బలోపేతం చేయాలనే దూరదృష్టితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని మంత్రి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో రెండు దశాబ్దాల వరకు మార్కెట్ అవసరాలను తీర్చగలిగే విధంగా ఈ మార్కెట్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ ఇప్పటికే దేశంలోనే ఆదర్శవంతమైన వ్యవస్థగా ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. 1962లో ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం రాష్ట్రంలో 206 వ్యవసాయ మార్కెట్ కమిటీలు, 79 ఉప మార్కెట్ యార్డులు పనిచేస్తున్నాయని, ప్రతి సంవత్సరం సుమారు రూ.80 వేల కోట్ల విలువైన వ్యవసాయ వాణిజ్య కార్యకలాపాలు ఈ మార్కెట్ల ద్వారా జరుగుతున్నాయని తెలిపారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణ, మార్కెట్ల అభివృద్ధి, ధరల సమాచార ప్రచారం, రైతు బజార్ల నిర్వహణ, కనీస మద్దతు ధర కొనుగోళ్లకు అవసరమైన సదుపాయాల కల్పన వంటి కార్యక్రమాలను మార్కెట్ కమిటీలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ పండ్ల మార్కెట్ అభివృద్ధి ప్రయాణంలో జాంబాగ్, గడ్డిఅన్నారం, బాటసింగారం మార్కెట్లు కీలక పాత్ర పోషించాయని మంత్రి గుర్తు చేశారు. అయితే పండ్ల వ్యాపారం, రవాణా, వినియోగం గణనీయంగా పెరగడంతో ప్రస్తుతం ఉన్న సదుపాయాలు భవిష్యత్ అవసరాలకు సరిపోవని స్పష్టమైందన్నారు. ఈ నేపథ్యంలోనే కోహెడాలో అత్యాధునిక సదుపాయాలతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని సుమారు 1.65 లక్షల మంది పండ్ల రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని 3,661 మంది పూల రైతులకు ప్రత్యేక పూల మార్కెట్ ద్వారా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు, ఎగుమతిదారుల అవసరాలను ఒకే వేదికపై తీర్చగల సమగ్ర మార్కెట్ వ్యవస్థగా కోహెడా మార్కెట్ రూపుదిద్దుకోనుందని మంత్రి తెలిపారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967